Reg. No M-757

అభినవసరస్వతి

[మాసపత్రిక]

సంస్కృతాంధ్రద్రావిడాది బహుభాషాపండితులు నుపన్యాసకులు నగు
శ్రీ శ్రీ జగద్గురు కాంచీకామకోటి పీఠాధిపతులచే షోడశోత్తర
శతకావ్యసమర్పణపురస్సరముగా వృద్ధసరస్వతియని పిలువఁబడిన
జనపాటి పట్టాభిరామశాస్త్రిచేఁ
ప్రచురింపఁబడుచున్నది.

గుంటూరు.

సంపుటము 37 | 1945 ఫిబ్రవరి, మార్చి నెలలు | సంచికలు 11, 12

విషయములు.

చందానిర్ణయము సంవత్సరమునకు

మహారాజపోషకులకు	రు 116-0-0	పోషకులకు	రు 10-0-0
రాజపోషకులకు(ఒకేసారి)	116-0-0	సహాయులకు	5-0-0
మిత్రపోషకులకు	25-0-0	చందాదారులకు	3-0-0

Printed at the Chandrika Press, Guntur,
and published at **Guntur** by the Editor, Astavadhani
Janapati Pattabhirama Sastry,
author of Nagarakhandam, etc., etc.

మహారాజపోషకులు

శ్రీ శ్రీ శ్రీ విక్రమదేవవర్మ మహారాజావారు,
జయపురసంస్థాన ప్రభువులు.

రాజపోషకులు

౧ శ్రీమంతు, రాణీ ఆదిలక్ష్మీదేవమ్మ బహద్దరుగారు,
గద్వాలసంస్థానము.

౨ శ్రీ శ్రీ జగద్గురు కామకోటిపీఠాధిపతులు - కుంభకోణము

౩ కొండపల్లి గోపాలరావు దేశముఖుగారు, హేమచంద్రపురం

ప్రధానపోషకులు.

౧ శ్రీ శ్రీ జగద్గురు, అభినవోద్దండ విద్యాశంకరభారతీ
స్వాములవారు, పుష్పగిరి

౨ తూగెళ్ల నరసింహారావుగారు, కరణము, మోర్జంపాడు.

౩ ఆర్. రామారెడ్డిగారు, డైవముదిన్నె.

౪ రాణి వేంకటరత్నాంబ, రాజా సురభి వెంకటజగన్నాథరావు
బహాదరుగార్లు, జటప్రోలుసంస్థానము

౫ శ్రీ శ్రీ లక్ష్మీనరసింహస్వామివారు, యాదగిరిసంస్థానము.

౬ లింగాల గంగారెడ్డి దేశముఖుగారు, గణపురము

పోషకులు

౧ జాగర్లమూడి కుప్పుస్వామినాయుడుగారు, కారంచేడు.

౨ కొండ్రి వెంకటకృష్ణారెడ్డి దేశముఖుగారు, మక్తెమచ్చాల

౩ బీరవోలు రామచంద్రారెడ్డి దొరవారు, వేంకటరావుపల్లె.

౪ శ్రీమతి కవితిలక కాంచనపల్లి కనకాంబగారు,
శ్రీ తిరుమల శ్రీనివాస త్రిలింగ మహావిద్యాపీఠము - బెజవాడ

౫ రాజా రఘునందనసింగుగారు, నెల్లూరు.

౬ మిర్యాలపురకుల రామకృష్ణారావుగారు, ప్రైవేటుశక్రెటరీ,
జటప్రోలు సంస్థానము.

౭ వినపాముల సీతారామయ్యగారు, గుంటూరు

౮ వావిళ్ళ వెంకటేశ్వరశాస్త్రిగారు, చెన్నపట్టణము.

౯ మద్దూరి సాంబయ్యగారు-పాగాకుకంపెనియేజెంటు-పరుచూరు

౧౦ జమలాపురం వేంకటేశ్వరరావుగారు, వకీలు - కంభంమెట్టు

౧౧ ఇటికాల రాజేశ్వరరావుగారు, వకీలు - కంభంమెట్టు

అభినవసరస్వతి

సంపుటము 37	తారణ సం॥ మాఘ, ఫాల్గునమాసములు 1945 ఫిబ్రవరి, మార్చినెలలు	సంచికలు 11, 12

కృతివిమర్శము

హిందూకోడ్ సమీక్ష:

గ్రంథకర్త ముదిగొండ మల్లికార్జునరావుగారు. గ్రంథముసంగతి తరువాతఁ జూతముగాని దానికి సికింద్రాబాదు సనాతన ధర్మమహాసభకుఁ గార్యదర్శియగు పంగపల్లి నీలకంఠముగారి పీఠిక గ్రంథలేఖనమునకుఁ గల కారణమును జక్కఁగా వివరించుచున్నది గాన నందలి పంక్తులు కొన్ని దిగువఁ బరికింతురుగాక.

"... హిందూలారిఫారమ్ను పేరుతో మన ధర్మమును నాశమొనర్ప... ప్రయత్నమొకటి జరుగుచున్న విషయము పాఠకుల కందఱకును దెలిసియే యున్నది. ...సర్వాధికారములు గల ప్రభుత్వమువారే భారతదేశము తమ...నియమములతోఁ బరిపాలింపఁజాలక ...శాసనసభల నేర్పఱచి వాని ద్వారమున...పరిపాలింపవచ్చునని నియమించియున్నారు...గడువు పూర్తియై ప్రభుత్వమువారిచే నాయుర్దాయము పొందుచున్న శాసనసభవారి కిట్టిధర్మపరివర్తనము నొనర్చునధికార మెక్కడిది?...శాసనసభా సభ్యులు ప్రజల ప్రతినిధు లెంతమాత్రమును గారని ... తెలిసికొందురుగాక ... విక్టోరియామహారాణి...వాగ్దానము విస్మరించి...శాసనసభలపై నెపమువైచి మతధర్మమున జోక్యముకలుగఁజేసికొనుట ప్రభుత్వమువారి కెంతమాత్రమును దగదు. శారదా యాక్టునాఁటినుండియును బవిత్రధర్మము కళంకిత మొనర్ప...ప్రయత్నించుటచేతనే నేఁడు...వారు దుష్ఫలితముల ననుభవించుచున్నారు. దేశమంతయు క్షామముతో భయంకరముగ నున్నది...సామ్రాజ్యమునకుసహితము భంగము వాటిల్లునాయని సందేహము కలుగుచున్నది...వారు మతసమస్యలో జోక్యము కలుగఁజేసికొనక ధర్మదేవతానుగ్రహమునకుఁ ... పాత్రులయ్యెదరుగాక...సంభవించెడి కష్టములు కొన్ని యీపుస్తకమునందు ... వివరింపఁబడియున్నవి...."

పీఠికయే యిట్టిదైయుండ గ్రంథ మెట్టులుండునో గ్రహింతురుగాక. గ్రంథకర్త సంస్కృతాంధ్రాంగ్లహిందీభాషలలో విద్వాంసుఁడు. కావున గ్రంథమందలి పంక్తులును గనఁబఱతును గొన్ని.

"...ఈకోడ్ పరివర్తనమున నియమించిన కమిటీయం దందఱును పాశ్చాత్య విద్యార్థులును పాశ్చాత్యసంస్కారములయందే పెరిఁగి వానియందే యభిమానముఁగల వారగుటను వారికి హిందువుల ధర్మశాస్త్రమునుగుఱించి యణుమాత్రమైనను దెలియక పోవుటచేతను నట్టికమిటీ...హిందువుల కెన్నటికిని యోగ్యము కాఁజాలదు...వారు

ధర్మశూన్యమగు లౌకికదృష్టితోనే యాలోచించెదరు. వారిధర్మముల... కాని యాచారముల... కాని తెలిసికొనవలయుననిన సదాచారసంపన్నులగు బ్రాహ్మణు లున్నారు. గురువులున్నారు. పురోహితులున్నారు. ధర్మాధికారులున్నారు. మఠాధీశ్వరు లున్నారు. వీరే యీ విషయమున సలహానొసంగుటకు యోగ్యులు. అట్టివారి యభిప్రాయములను దీసికొనకుండ... విప్లవకరమగు మార్పు లొనర్పఁబూనుట...సాహసమనియే చెప్పనగును. ఇట్టియధికార మెవ్వరికిని లేదని... ఇఁకముం దిట్టి శాసనబాటుల నొనర్పవలదని ప్రభుత్వమును గోరుచున్నాము...

పిత్రార్జితమునఁ బుత్రునకువలెనే కొమార్తెకుఁగూడ...భాగ మీయవలయునని ...హిందూదాయభాగమునందు మహమ్మదీయ సిద్ధాంతమును...ఇఱికించినారు... చెల్లెలు...అన్నలతో...ఆస్తికొఱకుఁ బోరాడును...ఆస్తి అనేకవిధముల విభక్తమై యొకకుటుంబమునకు సంక్రమించును...ఇఁక నన్నచెల్లెండ్రకు బావమఱఁదులకు వియ్యంకులకు... వ్యాజ్యపుఁబరంపరలు...

ఈ క్రొత్తచట్టమునందు హిందువులకుసహితము విడాకుల ద్వారము తెఱవఁబడినది ...భార్యాభర్తలలో నెవ్వరైనను విడాకులకు జిల్లాకోర్టులోఁగాని హైకోర్టులోఁగాని దరఖాస్తు పెట్టుకొనవచ్చును...కోర్టునందు...వైవాహికము...ముక్కలుముక్కలుగ విమర్శింపఁబడును. పాతివ్రత్యము బలిదీయఁబడును ... స్త్రీలను ... నాశనమొనర్చును. ... ఈ చట్టము దుర్మార్గు...లు...చక్కఁగ నుపయోగించుకొందురు. క్రొత్తక్రొత్త భార్యలు దొరకుదురు ... ఒక్కొక్క రెన్నివివాహములనైనను జేసికొనవచ్చును. ఎన్ని విడాకులనైనను నీయవచ్చును. షహాబాష్! ముసల్మానులనుండి స్త్రీవారసత్వమును... క్రైస్తవులనుండి విడాకులు స్వీకరింపఁబడినవి ... పాశ్చాత్యులందఱును విడాకుల దుష్పరిణామము ... అసహ్యించుకొనుచున్నారు ... వారందఱిచే నసహ్యించుకొనఁబడుచున్న విడాకులచట్టము భారతదేశమునందు... వ్యాపింపఁబోవుచున్నది. షహాబాష్! నవనాగరికుల తెలివితేటల కెంతయైన సంతసింపవలసియున్నది.”

కావున నీచిన్నగ్రంథము నెల్లరును బఠించి యింగ్లీషుప్రభుత్వమువారి కిట్టి సనాతనధర్మపరివర్తనమున కియ్యకొనమి చయ్యన నెయ్యముతో నివేదించుకొందురుగాక. గ్రంథము సికిందరాబాదు సనాతనధర్మమహాసభాకార్యదర్శియగు వంగపల్లి నీలకంఠము గారిపేర వ్రాసికొనినఁ బడయఁగలరు.

ఆంధ్రరాష్ట్రము—

ఆంధ్రదేశోద్ధారకులమని బయలువెడలినవా రాంధ్రదేశ మెల్లఁగలసి యొకరాష్ట్రముగా నుండవలెనని కొంతకాలమునుండి యత్నించుట యందఱకును దెలిసియున్నదియే. ఏతదుద్బోధకమే యీగ్రంథము. ఈగ్రంథకర్త యాంధ్రుల యభివృద్ధి నభిలషించుచు రచించినట్లు పద్యాలవల్లఁ బ్రస్ఫుటమగుచున్నది. సీసములుఁ జంపకమాలాదులు నందమైన నడకతో నాహ్లాదకరముగా నున్నవి. మూఁడు

సీ. కనుపింపరే యాంధ్రకవితాప్రసాదంబు
పెట్టిన నన్నయభట్టు లిపుడు!
వెలుగొందరే యాంధ్రవిజయపతాకంబు
నాఁటిన కృష్ణభూనాథు లిపుడు!
రహియింపరే యాంధ్రమహిమంబు భాసిల్లఁ
జేసిన యల రామదాసు లిపుడు!
వినిపింపరే యాంధ్రవిమలగాంధర్వంబు
నాలపించిన త్యాగయార్యు లిపుడు?
విదితముం జేయరే యాంధ్రవీరపటిమ
కదనసింహులు ఖడ్గతిక్కన్న లిపుడు?
తనరఁ జేయరె యాంధ్రవదాన్యగరిమ
ఘనయశస్కులు మంత్రిభాస్కరులు నిపుడు!

గోలకొండ పక్షపాతము

(...జాతీయవాది)

గోలకొండపత్రిక...లో గోలకొండపక్షపాతము వ్యాసము చదివినవానికి గోలకొండ జాతీయతకు భంగముకలిగినదని తెలియకమానదు ... సనాతనధర్మవిధ్వంసకులగు సంఘసంస్కర్తృనామధారుల వార్తలను బ్రకటించుటలో జాతీయపత్రికయగు గోలకొండ సనాతనధర్మానుయాయులవార్తలకన్నను దక్కువయే ప్రకటించుచున్నదఁట. ఈ పలుకెంతనిజమైనదో గోలకొండపాఠకు లెఱుఁగకపోరు. ముండలపెండ్లిండ్లవార్తలేమి యస్పృశ్యతానివారణవార్తలేమి సంకరవివాహవార్తలేమి ప్రతిపత్రికలోఁ దఱచుగాఁ బ్రకటించుచుండుట లోకవిదితమే.... శాస్త్రులు చర్చించుకాలము గడచిపోయినదఁట. ధర్మాధర్మవిచారసమయ మతిక్రమించినదఁట. ఇంతకన్న మఱియొకటి చిత్రముండునా? వీరికి శాస్త్రములతోఁగాని ధర్మాధర్మములతోఁగాని సంబంధము లేకపోయినను గోటి ౨౦ లక్షల జనులకు ధర్మాధర్మములతోఁ బ్రాచీనసంప్రదాయములతో నికటసంబంధమున్నది...సనాతనులమాటల నెవరు విందురని జ్ఞానలవముగలవారు తలంచుచుండవచ్చును. పట్టణవాసులలోనున్న పాశ్చాత్యమానులు దప్పఁ దక్కినవా రందఱుఁ బూర్వాచారములనే నెఱవేర్చుచున్నారు. నెఱవేర్చఁగలరు. సనాతనుల యజాగ్రదవస్థలో స్వరాజ్యమిప్పింతుమని... మోసగించి కౌన్సిల్లకు వెళ్ళి సుహృద్ద్రోహమొనర్చిన సంఘసంస్కారులు కర్మఫలము లనుభవింప మానుదురా? ... జాతీయపత్రికయను నామమును దీసివేసి సంస్కరణ పత్రికయని నామము నుంచుకొనుట గోలకొండకు శ్రేయస్సు ... రహబరదక్కన్ వంటి మతేతరపత్రికలు హిందూమతమును గాపాడుటకై ... వార్తలను

నిష్పక్షపాతముగా నెప్పటికప్పుడు ప్రకటించుచుండ మనజాతిలో మనరక్తమున ... పుట్టిపెరిగిన గోలకొండ హిందూమతమును గాపాడు వార్తలఁ బ్రకటింపకపోవుటయే కాక స్వజాతిద్రోహమొనర్చువార్తలను బ్రకటించుచు సంపాదకీయవ్యాసములందుఁగూడ జాతిధ్వంసకరములనే ప్రకటించుట హేయము ... ఎవరేమన్నను దన యుద్దేశమును వదలుకొనదఁట ... ఈబండపట్టుదలగల పత్రికలకు ... సహాయముఁజేయు సనాతనులే మూర్ఖులు.

—✱ గద్వాలసభలో నొక శతావధానినిగూర్చి ♦—

(శతావధాని గాడేపల్లి వీరరాఘవశాస్త్రి గారు. సంస్థానపండితులు.)

సీ॥ హవ్యవాట్కీశభూషాకృతి యగుటచే
ధూమరేఖకుఁ బూజ దొరకినట్లు
కపిలధేను శరీరకాంతి తా నగుటచే
నీలద్యుతి సపర్య దేలినట్లు
శ్రీకృష్ణదేహానిషిక్తతఁ దవ్రులుట
దక్షిణాత్వము మెప్పు దవిలినట్లు
సర్వజ్ఞమస్తక సక్తమై యుండుట
పార్థప్రహార మొప్పుఁబడినట్లు
భువనమోహనరచనా ప్రభూతధార
ణాంచితశతావధాన విన్యస్తపదము
దాల్చియుండుట నీతని తనువుగూడ
మహిమ గొనియున్న దొకకొన్ని మండలముల.

—♦ శ్రీశైలము ♦—

... ...

శ్రీశైలము పురాతనపుణ్యక్షేత్రము. యోగుల కావాసము... త్రింశత్కోటి దేవతల కాలవాలము. మనోహరంబులగు బహువనంబులకు జన్మభూమి. లతాసంతాన వేల్లితంబులగు ననేక కుంజపుంజములకు నివాసము. క్రూరజంతుసందోహసమేతంబులగు కాఅడవుల కునికిపట్టు. ముముక్షువులకుఁ గొంగుబంగారము. ఐహిక ... ంబుల నభ్య ర్థించు నభ్యర్థులకుఁ గల్పభూరుహము. దర్శనమాత్రంబుననే ముక్తినొసంగు శిఖరరాజమునకు నిలయము.

శిఖరేశ్వర హాటకేశ్వరాది దివ్యక్షేత్రములకుఁ గన్నతల్లి. సర్వాభీష్టముల నొసంగు భ్రమరాంబా మల్లికార్జునులకు జన్మస్థానము. స్నానమాత్రంబుననే సకలపాపంబుల భస్మంబుఁజేయు పరమపవిత్రయైన పాతాళగంగామతల్లికిఁ బట్టుఁగొమ్మ....

... నాలుగు సింహద్వారములు. ౧ త్రిపురాంతకము ౨ సిద్ధవటము 3 అలంపురి ౪ ఉమామహేశ్వరము. ఈ ద్వారములుగాక యుపద్వారములు 30 యోజనముల పొడవును 30 యోజనముల వెడల్పును మొత్తము ౯౦౦ యోజనముల విస్తీర్ణత గలదై శ్రీశైలక్షేత్రము ప్రకాశించుచున్నది.

8 శిఖరములు. ప్రతిశిఖరమందును ననేకలింగములు. అనేకతీర్థములు. ... ప్రాక్శిఖరం బఖిలదేవతావర్గంబున కాలయంబై ... హేమకూటంబన వెలయు. దక్షిణశిఖరం బహోబలంబన...నారాయణున కాలయంబై యుండు. పశ్చిమశృంగంబు నందిమండలంబన ... నందీశ్వరుని కాలయంబగు. ఉత్తరగోపురంబు సోమేశ్వరంబన ... కుమారస్వామికి నివాసయోగ్యంబై యుండు.

కృతయుగంబున శిలాదుండను మహర్షి శంకరునిగూర్చి తపంబాచరించెను ... శివుఁడు సాక్షాత్కరించెను... శిలాదుండు పుత్రభిక్ష పెట్టుమని యడుగ శంకరుఁ డటులే యని వరంబొసంగి యంతర్హితుండయ్యెను.

శిలాదునకు నందికేశ్వరుఁడు పర్వతుఁడు ... కుమారరత్నములు ... వారిలోఁ బ్రథముఁ...డతిఘోరతపం బాచరించి శంకరుని బ్రత్యక్షము చేసికొని ప్రమథగణాధిపత్యమును నీశ్వరవాహనత్వమును ... వరంబులు గైకొనెను.

... ద్వితీయపుత్రుఁడు ... నిరాహారియై తపంబొనర్చెను. త్రిలోకములు నాతని తపోగ్నిజ్వాలలచే దహింపఁబడుచుండెను. త్రిదశులు ... మొఱపెట్టుకొన శివుఁడు పర్వతు నెదుటఁ బ్రత్యక్షమయ్యెను. వరంబు వేఁడుకొనుమనెను.

పర్వతుఁడు ధనంబునుగాని రాజ్యంబునుగాని యాచించలేదు. కీర్తిని గోరలేదు. సంతానమును గోరలేదు. ... మహేశా! నేను బర్వతాకారము దాల్చెదను. నా శిరంబున నీవు త్రింశత్కోటిదేవతలతోడను బ్రమథులతోడను సమస్తతీర్థక్షేత్రములతోడను స్వయంభూలింగరూపంబున నవతరింపవలయు. సర్వ స్వయంభూ లింగములు సిద్ధలింగములు దేవప్రతిష్ఠిత లింగంబులు నన్నియు నాయందే యుండవలెను. మదీయ శిఖరదర్శనమాత్రంబుననె జనులకు ముక్తినొసంగవలయును. ఇదియే నా ప్రార్థన మన శివుం డట్టే వరంబొసంగె. అదిమొదలు పర్వతుఁడు పర్వతాకారంబు ధరించె. పార్వతీపరమేశ్వరులు నందే వెలసిరి.

...కృతయుగాంతమున సుమతియను...మునీంద్రుఁడొకఁ డుండెను. అతనికి శ్రీయను నొక కుమారీరత్నము. ఆ బాలిక ...అత్యుగ్రతపం బాచరించి పరమేశ్వరు సాక్షాత్కారమొనర్చుకొనెను. శంకరుఁడు వరంబొసెంగెద నడుగుమనెను. ఆబాలిక ...మహేశ్వరా! ఈ పర్వతమున కెల్లకాలము నాపేరు ముందిడి పిలుచునట్లు వరమనుగ్రహింపుమనెను. శివు డట్టె వరంబొసంగి యంతర్హితుండయ్యెను. అదిమొదలు... శ్రీపర్వతమనియు శ్రీశైలమనియు జనులు వ్యవహరించుచున్నారు

మల్లికార్జుననామధేయ మెట్లు కల్గినది?

పూర్వము శ్రీశైలసమీపమున మల్లికాపురంబను నొక నగరము కలదు దానిని చంద్రగుప్తుఁడను రాజు పరిపాలించుచుండెను అతనికి భోగములందుఁ గొదవలేదు. సంపదలకుఁ గొఱంతలేదు కాని సంతానమునకు మాత్రము కొఱంత...

అతఁడీశునిగూర్చి తపమొనర్చెను. పుత్రభిక్ష నర్థించెను. కాని శంకరుఁడు నీకుఁ బుత్రసంతానము గల్గదనియుఁ గొన్నిదినంబుల కొక సుగుణఖనియగు పుత్రిక జన్మించుననియుఁ నామెచే నీకుఁ గీడుమూడినను వంశమున కంతయుఁ గీర్తివచ్చుననియుఁ వచించి యదృశ్యుఁడయ్యెను

చంద్రగుప్తుఁడు పుమపత్యాలాభమునకై విచారపడెను. కాని లాభమేమి? అతఁడు శత్రుసంహారమునకై విదేశమునకుఁ జనెను. ... ...

...సతీతిలకము...గర్భవతిగానుండెను. నవమాసములు నిండినవెనుక నొకచక్కని కన్నియఁ గనెను. పురోహితులాబాలికకు జాతకర్మాదికృత్యములు నిర్వర్తించి చంద్రమతి యని పేరుఁబెట్టిరి.

చంద్రమతి శుక్లపక్షచంద్రునివలె దినదినాభివృద్ధి గాంచుచుండెను. యౌవన మంకురించెను. లావణ్యవతియగు నాబాలిక సౌందర్యమున రతీదేవిని దిరస్కరించుచుండెను. సకలవిద్యల నభ్యసించెను.

చంద్రగుప్తుఁడు విదేశమునుండి తిరిగివచ్చునప్పటికి ౧౨ వత్సరము లయినది. శత్రువుల జయించి సైన్యసమేతుఁడై ...స్వనగరమున కరుదెంచెను.

చంద్రమతి సఖులతోఁ జని...కోమలకంఠమున మధురముగఁ బాటఁబాడుచుఁ గర్పూరహారతి యొసంగెను. చంద్రగుప్తుఁడు కూఁతురని మంత్రిపురోహితులచే బోధింపఁబడినను నాబాలిక సౌందర్యాది విభ్రమంబులఁ గాంచి మన్మథబాణహతుఁడయ్యెను. మోహము నిల్పఁజాలకపోయెను. నాకు సంతానమే లేదనెను. వారిమాటలఁ జెడచెవిని బెట్టెను. శివుని గూర్చి తాను జేసిన తపంబు మఱచెను. ఇదియంతయుఁ గాల మాసన్నమగుటచేఁ బుట్టిన దుర్బుద్ధి.

సతీతిలకము మంత్రిపురోహితులు...బోధించినను...వినలేదు. కామబాధాపరవశు...ఎవరు నివారింపఁగలరు? అతఁడు కొమార్తె హితముకాదని యుపదేశించినను వేడికొనినను వినలేదు. పలుకరానిమాట లెన్నియో పలికి...కౌఁగిలించుకొనఁబోయెను.

ఆబాలికారత్నము కన్నీరు మున్నీరుగాఁ గార్చుచు జనకా! కూడనిపనియని యెంతచెప్పినను వినుచున్నవాఁడవు కావు. శంకరునిగూర్చి తపంబుఁజేసి నీమద మణంగించెదనని పలికి కృష్ణానది దాఁటి శ్రీశైలమున కేగి...మల్లికాకుసుమంబులఁ బూజించుచు నుగ్రతపంబాచరింప శంకరుఁడు ప్రత్యక్షమై నీ కేమికావలయునని యడిగెను.

చంద్రమతి...నాతండ్రి కన్నుగానక నన్నవయఁగోరె, నేనును నాజననియు నెంతచెప్పిన వినఁడయ్యె, ప్రతియుగంబువారును నిట్టిదుష్కృత్యమునఁ బ్రవేశించకుండు నట్టుల జనకుని శిక్షింపుము . అనిపలుక శివుఁడాగ్రహంబున పచ్చబండై పాతాళగంగ యందుఁ బడునటులఁ జంద్రగుప్తుని శపించె .

ఆబాలిక నుతింప నీశ్వరుఁడు... సంతసించి యొక వరము కోరుకొనుమనెను... నేను మల్లికాకుసుమంబులఁ బూజించితిని గాన మల్లికార్జునాఖ్యచే నీవు వెలయునటుల వరంబుఁ బ్రసాదింపుమన శంకరుఁడట్లే యొసంగి యంతర్ధానమాయె.

అది మొదలుకొని పర్వతేశ్వరునకు మల్లికార్జునుఁడను పేరు వచ్చెను... పాతాళ గంగ... జలము శాపవశమునఁ బచ్చగాఁ గాన్పించుచున్నది. నేఁటికిని నా ప్రదేశము లన్నియుఁ... బూర్వపు గాథల స్మరింపఁ జేయుచు... న్నవి.

శ్రీశైలమున ననేక... గుహాలు ననేక కుండములు ననేక విచిత్రములుఁ గలవు. అవియన్నియుఁ శ్రీశైలఖండమునఁ జెప్పఁబడియున్నవి. వాని మహిమలు ఫలితములు వచింప నలవిగాదు

...ఆటకళ్ళో నీశ్వరుఁ డుద్భవించుటచే హాటకేశ్వరమని పేరువచ్చినటుల వచించుదురు.

శిఖరేశ్వరము... అందుఁగల విభూతికుండమునలో స్నానముచేసి స్వామిని దర్శించి శిఖరముమీఁది కెక్కుదురు. ఆశిఖరము పొత్రములా గుండును. యాత్రికులు కొబ్బెర నువ్వులు వేసి త్రిప్పుదురు. ఆధార క్రిందనున్న స్వామి శిరంబుపైఁ బడును. అట్లుత్రిప్పుచు శ్రీశైలశిఖరము వ్రేలితోఁ జూపించి కనఁబడినవెంటనే శ్రీశైలశిఖరం దృష్ట్వా పునర్జన్మ నవిద్యతే యని పఠించుచుందురు. (శైవప్రచారిణి)

— వ్యాసాష్టోత్తరశతనామస్తోత్రమ్ —

శ్లో. వ్యాసో ద్వైపాయన శ్శ్రేష్ఠ స్సత్యాత్మా బాదరాయణః ।
మునిస్సత్యవతీపుత్ర శ్శుకతాత స్తపోనిధిః ॥ ౧

వసిష్ఠనప్తా సర్వజ్ఞో విష్ణురూపో దయానిధిః ।
పరాశరాత్మజ శ్శాంత శ్శక్తిపౌత్రో గుణాంబుధిః ॥ ౨

కృష్ణో వేదవిభక్తాచ బ్రహ్మసూత్రకృ దవ్యయః ।
మహాయోగీశ్వర స్సౌమ్యో ధన్యః పింగజటాధరః ॥ ౩

చీరాజినధర శ్శ్రీమా నష్టాదశపురాణకృత్ ।
దండీ కమండలుధరః కురువంశప్రవర్ధకః ॥ ౪

నిర్మమో నిరహంకారో నిష్కళంకో నిరంజనః ।
జితేంద్రియో జితక్రోధ స్స్మృతికర్తా మహాకవిః ॥ ౫

తత్త్వజ్ఞానీ తత్త్వబోధకర్తా కాశీనివాసభూః ।
మహాభారతకర్తాచ చిరజీవీ మహామతిః ॥ ౬

సజ్జనానుగ్రహకర స్సత్యవాదీ దృఢవ్రతః ।
బదర్యాశ్రమసంచారీ కోటిసూర్యసమప్రభః ॥ ౭
త్రిపుండ్రవిలసత్ఫాలో హ్యష్టావింశతిరూపభృత్ ।
రవీందుమితశిష్యాఢ్య స్సుశీలో యతిపూజితః ॥ ౮
వైయాఘ్రచర్మవసన శ్చిన్ముద్రావిలసత్కరః ।
రుద్రాక్షమాలాభూషాఢ్యః కలిపాపనివారకః ॥ ౯
ధర్మాశ్వమేధసందేష్టా సంజయజ్ఞానదృష్టిదః ।
ధృతరాష్ట్రపుత్రదర్శీ విదురాదిప్రపూజితః ॥ ౧౦
పుత్రమోహవ్యాకులాత్మా జనకజ్ఞానదాయకః ।
కర్మఠో దీర్ఘదేహాఢ్యో దర్భాసీనో వరప్రదః ॥ ౧౧
యామునద్వీపజననో మోక్షోపాయప్రదర్శకః ।
ఋషిపూజ్యో బ్రహ్మనిధి శ్శిఖావాన్ జటిలః పరః ॥ ౧౨
అష్టాంగయోగనిరత స్సర్వసిద్ధిసమన్వితః ।
గాంధారీగర్భసంరక్షః పాండవప్రీతిసంయుతః ॥ ౧౩
వసుభూపాలదౌహిత్రో ద్రోణనందనశాపదః ।
వ్యాసకాశీసదావాసో నరనారాయణార్చకః ॥ ౧౪
నిత్యోపవాససంతుష్టః పరహింసాపరాఙ్ముఖః ।
శివపూజైకనిరతః సురాసురసుపూజితః ॥ ౧౫
సర్వక్షేత్రనివాసీచ సర్వతీర్థావగాహనః ।
యుధిష్ఠిరాభిషేక్తాచ స్మృతిమాత్రాప్తసన్నిధిః ॥ ౧౬
త్రికాలజ్ఞో విశుద్ధాత్మా నిర్వికారో నిరామయః ।
ఊర్ధ్వరేతా మాతృభక్తో నిశ్చింతో నిర్మలాశయః ॥ ౧౭
రూపాంతరచరః పూజ్య స్స్వశిష్యసమావృతః ।
భిక్షేశ్వరప్రతిష్ఠాతా నిరవద్యో నిరంకుశః ॥ ౧౮
సర్వభూతహృదావాస స్సర్వేష్టార్థప్రదాయకః ।
వ్యాసనామ్నా మష్టయుతం శతం జ్ఞానప్రదాయకమ్ ॥ ౧౯
శ్రీ వ్యాసపూజాకల్పోక్తనామ్నా మష్టోత్తరం శతమ్ ।
పఠనాత్ జ్ఞానసిద్ధి స్స్యాత్ వ్యాసనామప్రభావతః ॥ ౨౦

—♦ వ్యాసమహర్షి ప్రభావము ♦—

(పురాణము పిచ్చయ్యశాస్త్రిగారు)

శ్లో. అచతుర్వదనో బ్రహ్మా, ద్విబాహు రపరో హరిః,
అఫాలలోచన శ్శంభుః, భగవాన్ బాదరాయణః...

...భగవంతుఁడు సమయానుగుణముగాఁ బ్రపంచమున నొక్కొక్క రూపంబున నవతరించి సంసారార్ణవమగ్నులై దరిగానక తల్లడిల్లు మానవకోటిని నిజకరుణాతిరేకం బనెడి నావచేఁ దీరంబుఁ జేర్చి రక్షించుచుండును.

అటువంటి భగవంతుని యవతారములలో వ్యాసమునీంద్రావతార మొకటి యని యెల్లరు నెఱింగియున్న విషయమే. అయినను ... ఇతిహాసపురాణాదులు పండితులు చదివి తాత్పర్యముం జెప్పినపుడు వ్యాసుఁడనెడి మునియొకఁ డుండెడివాఁడనియుం మిక్కిలి గొప్పవాఁడనియుఁ బూజ్యుఁడై లోకంబునఁ బ్రసిద్ధి నొందెననియుం మాత్రము సందర్భానుసారముగా విని యప్పటికి సంతోషించి పోవుట తప్ప భగవంతుఁడైన వ్యాసర్షి ప్రపంచంబునకుఁ గావించిన మహోపకార మెట్టిదైనదియుం నేయేకార్యములు చేసినదియు నామహాత్మునివలన లోకమునకుఁ గలిగిన మేలేదియుం నంత వివరముగా నెఱుంగరు. ఈమహానుభావుని మహిమనుగూర్చి వర్ణింపఁబడిన విషయములు శ్లోకములుగను బద్యములుగను నుండుట...జనసామాన్యమునకుఁ దెలియకపోవుట కొక కారణమైనది. విద్యాగంధము లేనివారును స్వల్పముగాఁ జదివినవారును దాత్పర్యము తెలిసికొనఁ జాలక యీమహిమ నెఱింగికొనుట కష్టమని మానివేయుచున్నారు. కావున సర్వజనులును దెలిసికొనులాగున సంగ్రహముగా ముఖ్యమైన విషయములమాత్రము వివరింపఁబూనినాఁడ...

లోకంబున జనులు జ్ఞానరహితులై యరివర్గంబుచేఁ జిక్కువడి యింద్రియసుఖలంపటులై సంసృతిబంధంబుల విడిపించుకొనుటకు శక్తులుగాక నానాదుఃఖములు ననుభవించుటను జూచి శ్రీమన్నారాయణుండు తాపత్రయంబు నడంచి వారిని రక్షింపఁబూని ...విజ్ఞాననిధియు నసమానతపఃప్రభావసంపన్నుండును నగు పరాశరమహర్షి వర్యునకుఁ బుత్త్రుఁడుగా సత్యవతీగర్భంబుననుండి యవతరించి వేదవ్యాసనామంబునఁ బరిపూర్ణజ్ఞానసిద్ధిగలవాఁడై కృపాపూర్ణహృదయుండై ...జనులు భవబంధవిముక్తులై కడతేఱుట కనువుగా మార్గంబులం జూపినవాఁడయ్యెను.

ఆమహానుభావుఁడు గావించిన ప్రధానకార్యము వేదము సంస్కరించుట. ఆదియం దేకరూపముగా నుండు వేదమునందలి విషయములను ఋగ్యజుస్సామాథర్వనామంబులతో నాలుగుభాగములుగా విభజించి వానిని వరుసగాఁ దన శిష్యులగు పైల జైమిని సుమంత వైశంపాయను లనువారల కుపదేశించెను. పిమ్మట వారిచేఁ బెక్కుశాఖ లొక్కొక్కదానియందునుం గలుగునటులఁ జేయించె. ఈప్రకారముగా వేదములను సంస్కరించుటచే వేదవ్యాసుండనెడి నామం బామహాత్మునకు సిద్ధించె. వ్యాసులు విభజిం

చిన యీవేదములు కర్మమనియు బ్రహ్మమనియు రెండుభాగములుగా నొప్పుచుండును. మొదటిభాగమునఁ బరాత్పరుండైన భగవంతు నారాధింపవలసిన క్రమంబును విశేషములనుసం జెప్పఁబడినవి. బ్రహ్మమనెడి రెండవభాగమున సకల కర్మలవలనను నారాధింపఁబడు పరమేశ్వరుని నిత్యనిర్మలతత్త్వస్వరూపమును జెప్పఁబడినది. ఈవిషయ మామ్నాయముల కంతమైనది యగుటచే వేదాంతమనియుఁ బ్రహ్మస్వరూపబోధకమైన రహస్యంబగుటచేత నుపనిషత్తనియుఁ జెప్పఁబడుచుండును. పూర్వభాగజనిత సందేహనివారణకరమైన దానికిఁ బూర్వమీమాంసయని పేరు. ఇవి మూడువిధంబులై యుండును. తదర్థనిర్ణయశాస్త్రమును జైమినిచే రచింపఁజేసి యుత్తరభాగసందేహనివారణకరమగు విషయములను దానే వివరించెను. దీనిని బ్రహ్మమీమాంసయని చెప్పెదరు. ఈ ప్రకారము వేదార్థపరంపరను రెండుతెఱంగులుగాఁ జేసి సకలసందేహములను నివారించి లోకంబునకు మహోపకారము గావించె. అంతటితో మానెనా? లేదు. తాను నిర్ణయముచేసిన యర్థములను మఱియు విశదీకరింపఁదలంచి స్మృతియనెడి నామముతోఁ బూర్వభాగమునందలి యర్థములను గుఱించి చెప్పి యుత్తరభాగమందలి యర్థములను భారత భాగవతములనెడి యితిహాసపురాణరూపములచే విశదీకరించెను. ఇతిహాసరూపమై పంచమవేదంబని ప్రసిద్ధినొందిన భారతము నాలుగువర్ణములవారికి ననుకూలములైన ధర్మములుగలదియుఁ జతుర్యుగములయందును నాచరింపఁబడు విధుల సూచించునదియు ధర్మార్థకామమోక్ష ఫలప్రాప్తిమార్గంబుల నెఱింగించునదియు సకలగుణాలంకారశోభితమైనదియునై విలసిల్లుచుండును. పెక్కుపురాణాది గ్రంథములు రచించి తన్మూలమున జనులకు సులభముగా భగవద్భక్తి జ్ఞానవైరాగ్యంబులు గలుగునట్లు మార్గముల నేర్పఱచెను. సర్వసామాన్యముగా న్యాయము సత్యము భూతదయ యహింస మొదలగు విషయములును బ్రహ్మచర్యము మొదలుగాఁగల యాశ్రమములకుఁ దగిన ధర్మములును నిర్ణయముగావించెను. ఇట్లు మహాత్ముఁడైన వ్యాసభగవాను లితిహాస పురాణాదుల మూలమున .... సదాచారధర్మములును వానివలన శ్రద్ధాభక్తులును వానివలన ... సుజ్ఞానంబును నందుచే వైరాగ్యంబును దానికతంబున మోక్షంబును జనులకు సిద్ధించునటుల సదుపాయంబులు విశదీకరించెను. ఇట్టి మహోపకారము నొనర్చి లోకులను కృతార్థులగునట్లు చేసిన విష్ణుస్వరూపుఁడగు వ్యాసభగవానుని ప్రభావము తెలిసికొని వివరించుట కెంత .... వారికైనను సాధ్యముకాదు. మొదట భగవద్భక్తి కలిగినఁగాని జ్ఞాన మంకురింపదనియు జ్ఞానము కలిగినఁగాని వైరాగ్యము పొడమదనియు విరక్తిచెందిననే కాని మోక్షము సిద్ధింపదనియు నెంచి తొమ్మిదివిధముల భక్తిని వివరించెను. భగవచ్చరిత్రములు వినుటయు స్తోత్రముఁజేయుటయుఁ దలంచుటయు సేవించుటయుఁ బూజించుటయు నమస్కరించుటయుఁ బరిచర్యచేయుటయు మిత్రభావముకలిగియు నాత్మార్పణముఁజేయుటయు భక్తియొక్క లక్షణములు. ఈలక్షణము లెఱింగి యెవరు ప్రవర్తింతురో వారు సుజ్ఞానము కలిగి వైరాగ్య మేర్పడి ముక్తికిఁ బాత్రులగుదురనుట నిరూపించెను. కావునఁ బరమతత్త్వజ్ఞానస్వరూపుఁడైన శ్రీవ్యాసభగవానునిచేఁ జెప్పఁబడిన ధర్మములను దప్పక లోకంబున ననుష్ఠించు సత్పురుషులు పునరావృత్తిరహిత

మోక్షంబును బొందఁగలరు. వైశాఖము నాషాఢముఁ గార్తికము మాఘము ననెడి మాసములయందుఁ బూర్ణిమాదివసంబున వ్యాసుల భక్తితోఁ బూజించుచుండవలయును. అటులఁ జేసెడివారికిని వారిచే విరచింపఁబడిన గ్రంథములు పఠించి యందలి సారాంశము గ్రహించి తద్విధుల నిరంతరము ననుసరించి వర్తించువారికిని సంతోషారోగ్య భోగభాగ్యంబులును భగవత్సాయుజ్యసంప్రాప్తియుం గలుగుననుటకు .... సందేహము లేదు.

సీతాఫలము

(జ్ఞానాంబగారు)

మన దేశములో విచ్చలవిడిగా ఫలించు చెట్లలో సీతాఫలవృక్ష మొకటి. ఇది మహావృక్షజాతికిఁ జెందిన పెద్దచెట్టు కాదు. క్షుద్రవృక్షకోటికిఁ జెందిన చిన్న మొక్కయుఁ గాదు. మధ్య ... జాతివృక్షము. సాధారణముగా నిది తోఁటలలోపలఁగాక చుట్టును నాటఁబడును. కొండలమీఁదను నడవిలోను విరివిగాఁ బెరుఁగును. దోహదము చేయ నక్కఱలేదు. ఎక్కడనైనను బ్రతికి పైకిరాఁగలదు. ఇది సంపెంగజాతిలోని మొక్కయై యున్నది. సంవత్సరమున కొక్కతూరి దీనిపండ్లు సర్వసాధారణులు మొదలు సార్వభౌములవఱకుఁ గల సకలజనులదృష్టి నాకర్షించుచు నొకటిరెండు మాసములు వీథివీథికి విందులంపును. కొన్నితావులలో శ్రావణమాసముననే సీతాఫలము పండఁదొడఁగును. కృష్ణామండలమున భాద్రపదాంతమునఁ బండ మొదలిడును. ఆశ్వయుజ కార్తికములందు సీతాఫలము లవ్వారిగ లభించును. తీయని ... గుజ్జుతో నింపి దుమ్ము పడకుండ ముఱికి తగులకుండ ... ప్రకృతి మాత పంపినపరమాన్నమే యీఫలరసము. దీని ... చవిచూచుటకు ... నాగరకులు సంశయించుచున్నారు ... విషయుతములగు మందులను మ్రింగుటకు వెనుదీయనివారీయమృతసేవనమున కదలుపొందనేల? పసికిమాలిన వస్తువులతోఁ బాకము చేయఁబడి కశ్మలములై ముఱికిచేతులతో ముట్టఁబడుచు నన్నివిధముల ననారోగ్యకారులైయుండు పకోడి పెసరట్టు, ఇడ్డెనలడ్డు కాఫీ నామక వ్యర్థపదార్థముల నింటఁ జేయఁబడు వంటకముల నిస్సంశయముగ నిరాఘాటముగఁ దినుచుండువారీ ...ప్రకృతిసిద్ధనిర్మలనిరపాయకరఫలము నానుట కింత భయ మొందనేల? దానిం గూర్చి తిన్నగఁ దెలియకపోవుటయు మితితప్పి తినుటచేఁ గొన్ని దుర్లక్షణములు పొడఁజూపుటయు శరీరము రోగగ్రస్తమయియుండ నీఫల మారోగపదార్థమును వెలువరింప యత్నించుటయు నిందుకుఁ గారణములు. సీతాఫలమునందుఁ జక్కెర మిక్కుటముగానున్నది. ఆమ్లరసము వలె నిది శీఘ్రముగను సులభముగను జీర్ణము కాదు. నారింజ బత్తాయి సీమరేగు వాడినట్లు సీతాఫలమును వాడరాదు. కఱకఱయాఁకలియగునపుడు మితిమీఱకుండునట్లు తినఁగలిగి నన్ని పండ్లు తినవచ్చును. తినినపూట మఱిదేనిని దినకుండ నుండురేని ప్రతివారికి సీ ఫలము జీర్ణమగును. రోగులు సైతము జీర్ణశక్తి ననుసరించి దీని నిస్సంశయముగ భుజింపవచ్చును. సీతాఫలమునందలి సుగుణములను గొన్నిటి వస్తుగుణదీపిక యిట్లు వర్ణించుచున్నది.

"రక్తము నింద్రియమును వృద్ధిచేయును గుండెకు మనసుకు బలమునిచ్చును. జీర్ణశక్తి నిచ్చును. క్రిమిని హరించును"

కావునఁ బ్రకృతివరదానము గు నీస్వాదుఫలము నందఱును స్వేచ్ఛమై ననుభవింప నగును. సక్రమముగా నుపయోగించినచో నిది యారోగ్యసంవర్ధకమును సంతుష్టిప్రదమును గాఁగలదు.

శ్రీసాయిబాబా పంచరత్నములు

శా. శ్రీయున్ ధీయుఁ జిదాయు వాత్మసుఖమున్ సిద్ధింపఁగా యోగిరా
డ్ధ్యేయస్వీయమహాచరిత్రుని విరాగిన్ శుద్ధసంకల్పు నా
త్మాయత్తాఖిలసిద్ధు భక్తజనసర్వాభీప్సితార్థప్రదున్
సాయిన్ జేయిఁబవల్ మదీయహృదయాబ్జాతంబున న్నిల్పెదన్.

మ. ఘనవిశ్వాసమెలర్పఁ దన్ను సుమనఃకంజాతమధ్యంబునన్
గనువానిం గనువాని నెట్టిసుఖముల్ కాంక్షించినంగాని లో
ననుమానంబను మాట లేక తదభీష్టార్థంబులం గూర్చువా
నిని సాయి స్మరపాయి నాత్మఁ దలఁతు న్నిత్యంబు భక్త్యున్నతిన్.

ఉ. యోగియటంచు జ్ఞానియనియున్ ఘనమాంత్రికుఁడంచు వైద్యవి
ద్యాగురుఁడంచు జ్యౌతిషికుఁడంచును బెక్కురు పెక్కురీతులన్
సాగి నుతింప భక్తజనసర్వసుఖప్రదు నిన్ను సాయిబా
బా! గరుడధ్వజాపరశుభాకృతిఁగా వినుతించెదన్ మదిన్.

చ. నిరుపమభక్తి నన్యముఁ గణింపక, నీపదపంకజాతబం
భరము నొనర్చి చిత్తమును బావనమైన భవత్ప్రభావమున్
స్మరణమొనర్చునాతనికి సర్వసుఖంబులుఁ గూర్చునట్టి నీ
పరమకృపామహత్త్వము నుపాస్తియొనర్చెద సాయిసద్గురూ!

మ. నిలుచున్నప్పుడుఁ గూరుచున్నయపుడు న్నిద్రించుచున్నప్పుడున్
జెలికాండ్రం గని ముచ్చటాడునపుడుం జింతానిమగ్నుండనై
కలఁతం జెందుచు నున్నయప్పుడును నీ కల్యాణరూపంబు నా
తలఁపుం బాయని భాగ్యమిమ్ము హితబోధా! సాయినాథా!బుధా!.

పళ్లపాటి వాసుదేవశాస్త్రి—

—• డాక్టరుగారి మనువు •—

(తూములూరి సీతారామయ్యగారు)

మా శాయన్నగారి మోహన్ పట్నములో డాక్టరుపరీక్ష చదువుచున్నప్పుడే టెన్నిసులో మంచి ప్రావీణ్యము సంపాదించినాఁడ వాఁడి యొక పెద్ద విసికిడికూడను. డిసెంబరుసెలవులలో నేలూరుకు వచ్చినాఁడు. రాజమండ్రినుండి పిల్లనిచ్చెదమని వాండ్రు యింటికి వచ్చి యన్నియేర్పాట్లుఁ జేసికొని యొకరి నొకరు చూచుకొని యిష్టపడుచో ఖాయముచేసికొనుటకు మోహన్‌ని రమ్మన్నారు. మఱునాఁడు పంపెదనని శాయన్నగారు చెప్పినందున వారు వెళ్ళిపోయినారు.

నేను మోహన్ మఱునాఁడు సూట్లుధరించి షోకుషోకుగా బయలుదేఱినాము 2 గంటలకు రాజమండ్రిలో దిగి జట్కా యెక్కి యా యడ్రసుగల యింటి కేగినాము. బండి యాఁగెడునంతలోఁ బిల్లతండ్రి వచ్చి యాహ్వానించి లోపలికి దారితీసినాఁడు. కాళ్లుకడిగికొండనుచు నీళ్లుతెచ్చియిచ్చినారు. దొరవేషాలతో నున్న మేము కాళ్లుకడిగికోలేదు. హాలులోనున్న సోఫాలమీఁదఁ గూర్చున్నాము.

ఆ పెద్దకిటికీల కిరుప్రక్కలఁ జలువరాతి పెడస్టల్సుమీఁదనున్న యాశిల్పచిత్రాలు నడుగువేసిన దిగిపోయెడియంత మెత్తదనముగల యా పారసీ తివాచి పరాసువారియిండ్లనుగూడ మించిపోయినవి.

కాఁబోయెడి యత్తగారి సంజ్ఞ ననుసరించి యేపిల్సు పచ్చిద్రాక్ష కోవాబిళ్లలతో నలంకరింపఁబడిన యా పింగాణీ ప్లేట్లు సూర్యకిరణప్రసారణవలన మిఱుమిట్లుగొల్పుచున్నవి. ఆరగించినాము.

గుండ్రని మొగములో సంతోషము తొణికిపోయెడి చిఱునవ్వుతోఁ గడు నొయ్యారముగా నడుచుచుఁ దాంబూలపుఁ బళ్లెరమును టేబిలుమీఁదఁ బెట్టిన దొకపడుచుపిల్ల. ఆ వాలుఁగన్నులలో నుండి యొక్కచూపు తళుక్కుమన్నఁ జాలు. అబ్బ! ఎంత మాదకముచ్చటగానుండెడిది! ఇంతలో నాపిల్ల తండ్రి వచ్చి పిల్లను గూర్చుండు మన్నాఁడు. కడు నొయ్యారముగా మీటఁబడుచున్న యావీణతంతులు ప్రణయరసమును గురియుచున్నవి. జాజిపొదలమీఁదుగాఁ దేలుచు వచ్చెడి పవనకిశోరాల హాయికూడ నంతగా లేదు.

చేతికున్న రెండుజతల మిరియాలగాజులను బొంచిచూచుచున్న యా కర్నాటకపు గోహారురాళ్ల గోలాకులు నవతలవతలకుఁ బోఁజూచువాండ్రి నాకర్షించెడి యా పట్టుచీరెయుఁ గరెంటులాగునఁ జేయఁజూచెడి యా సోగకన్నులుఁ గాళ్లకున్న యా గజ్జల పాంజోళ్లు జాఱిపోవుచున్న దొంతరమల్లెల కత్తెరదండయుఁ గలువకన్నులలోను బాల బుగ్గలలోను మిసమిసలాడెడి తారుణ్యముగల యా మనోహరాకృతిని జూచెడిసరికి నెవరిని ముగ్ధులను జేయదు?

అంతట నే నాపిల్లతో వీరే డాక్టరుగారనునప్పటి కోరకంటితో దేపిచ్చుచు మెఱుపువంటి చిఱునవ్వుతో నదృశ్యమై పోయినది.

ఇంక డాక్టరుగారు హృదయములో నామె మూర్తిని జిత్రించెడి దీక్షతోఁ దన్మయుఁడై యుండెననుటకుఁ గలిపి పెనవేసికొనిపోవుచున్న వారి చూపులే సాక్ష్యము. రాత్రిబండికి బయులుదేఱి యేలూరుకు వచ్చినాము.

సమర్తాడినపిల్లను పెండ్లిచేసికొనుచున్నారనెడి యొక పెద్ద పుకారు బయలుదేఱి బంధువర్గములో ననేకానేక పోహలకుదారితీసినది. రాత్రిలగ్గాన కేకొద్దిమందియో వచ్చినారు. పెండ్లికూఁతురుఁ బెండ్లికుమారుఁడుఁ జేతులు పట్టుకొని వాకిలివద్ద నిలుచున్నారు. లోలాకులవారుః బక్కపాపటలవారు వాలుజడలవారు నాగారిచీరెలవారు గోపలిబాడీలవారు బర్మాముల్లవారు రిష్టువాచీలవారు నొకరితరువాత నొకరు తలుపుదగ్గఱఁ బాటలు పాడుచున్నారు. మోహన్ మాత్రము పిల్ల మణికట్టు పట్టుకొని నాడీచలనము పరీక్ష చేయుచున్నాఁడు. ముందు పెండ్లికొడుకుపేరు చెప్పవలెననుచున్నారు కొందఱు. పెండ్లికూఁతుపేరే ముందు చెప్పవలెననుచున్నారు వేళాకోళముగాఁ గొందఱు.

"మోహన్ బావగారూ! నేను వచ్చినాను దలుపుదీయుఁ"డన్నది యంతలోఁ బెండ్లికుమార్తె.

ఇంతలో వియ్యపురాండ్రకుఁ జేతులు చేతులు కలిసినవనెడి పెద్ద గోల రేకెత్తినది. ఏమీ యని విచారించునప్పటికిఁ బిల్లవాఁడు నాడీపరీక్ష చేసి కడుపు చూచి కడుపుతో నున్నట్లు తెలిసికొని పిల్ల చెయ్యి విదిలించి రివ్వున విడిదికిఁ బోయి తల్లిదండ్రులతోఁ జెప్పి వేసినాఁడని స్వస్తివాచనము చెప్పుకొనివచ్చినారు.

రాత్రిభోజనాలకుఁ బోలేదు. మోహన్‌ను మాత్రము వారి యింటిలోఁ బచ్చి మంచినీళ్లయినను ముట్టవద్దని చెప్పి యగ్నిహోత్రుని దగ్గఱఁ బడుకొనుటకుఁ బంపించినాను.

కలఁతనిద్రావస్థయం దాయర్ధరాత్రి యూహాపరంపరల వలన విసిగి వేసారిన మోహన్, ఒక స్త్రీ కంటిధారలోవలఁ దన పాదాలను దడిపివేయుచున్న సంగతి గ్రహించి యొక్క తన్ను తన్నినాఁడు. పాపము గిరగిరఁ దిరుగుచుఁ గ్రిందఁ బడిపోయినది. జాలి వేసినదికాదు ముఱుఁగుపడిన ప్రియుని హృదయమున.

చిన్నదానను, తెలియక బుద్ధి గడ్డితిన్నది. క్షమించి రక్షింపుఁడని లేచి యేడ్చుచు మరలఁ గాళ్లుపట్టుకొన్నది.

చిన్నదానవా? చిన్నదానవగుచో నేల కడుపువచ్చినదన్నాఁడు మోహన్. వెక్కి వెక్కి యేడ్చుచున్నది యజ్ఞాతవాసపు స్త్రీలాగున. భాస్కరుని కిరణప్రసారణవలన విడిపోవున్న మంచునలె మోహన్ చుట్టు నావరించుకొనియున్న కోపానలము మాయమై పోయినది. ఒకటి జ్ఞప్తికివచ్చినది. అయ్యో! శారదాబిల్లు వచ్చి బాల్యవివాహాలు పోఁబట్టియేకదా యని యొక్క వేఁడినిట్టూర్పు విడిచి చెదకుండ నున్నావా లేదా? నిజము

చెప్పుమన్నాఁడు. క్షమింపుమని బ్రతిమిలాడినది. జరిగినది చెప్పిన న్యాయముగా యన్నాఁడు మోహన్

నేనును మా మేనత్తకొడుకును S. S. L. C. చదువుచున్నపుడు సినిమాలకుఁ బోవుచుండెడివారము మా Selections అయిన తర్వాత మా స్కూలువారలతో సాంఘికనాటకమును ప్రదర్శించినారు. అందులో మేము కథానాయిక నాయకులము. మాపాత్రలను జాగ్రత్తగాఁ బోషించి మెప్పునొందుటకు రిహార్సల్సు చేయుచుండెడివారము. ఒకరోజున నట్టిసమయములో మాబావ నన్నుఁ బ్రేయసీ యని సంబోధించుచు "ప్రణయవతీ ! నాపైఁ గోపమా" యనెడి మరాటీకత్తుతో సాంగును పాడునప్పటికి నాకర్థము చాలక "యెట్టులో యుండెడిది. అదిచూచి మాబావ నన్నుఁ బట్టుకొన్నాఁడు. కాని యేమియుఁ జేసెడి సమయము గాకుండ వచ్చినది. మొగమోటమునకుఁ బోయినాను. అని వెక్కివెక్కి యేడ్చినది తలవాల్చి.

మీ బావనే పెండ్లిచేసికొనక నన్నెందుకుఁ జేసికొన్నా వన్నాఁడు.

జవాబిప్పుడు చెప్పలేను. క్షమించి రక్షింపుఁడు. లేకపోయిన నేనూతిలో 'నో పడుదునన్న దా పశ్చాత్తప్తురాలు.

పాపము. మోహన్‌కు జాలివేసినది. ఆత్మగౌరవమును నిలఁబెట్టుకోలే నందుకు విచారించినాఁడు నాతో విషయమంతయుఁ జెప్పివేసి దీనిసంగతి యేమన్నాఁడు. ఇంకఁజెప్పెడిదేమున్నది ? Lady Doctor ఉన్నదిగా యన్నాను.

మఱునాఁడు పోయి Lady Doctor తో మాటలాడితాము. పెండ్లి యయినమూఁడురోజులు నేలాగో జరిగిపోయినది. నిద్రలు వగైరా లయిపోయినవి. మందిప్పించినాఁడు. గ్రామములో గోల యెక్కువైనది. ఏమి చేయఁగలఁడు పాపము? సంస్కరణయనుచు బయలుదేఱుచోఁ దప్పుందదనుకొన్నాఁడు. డాక్టరైనాఁ డిప్పుడు మోహన్. దంపతులు సుఖముగా నుండుచున్నారు. ఇప్పుడామె యేడవనెల గర్భవతి. బారసాలకు భోజనాలున్నవి మనకు.

—♦ వ్యభిచారము ♦—

అనారోగ్యదేవత కాహుతిగ నొనర్పఁబడువారి సంఖ్యలో వ్యభిచారదోషుల సంఖ్యా ప్రధమస్థల మాక్రమించుటచేతనే వ్యభిచారమను నామమును స్మరించినంతమాత్రమున సదాచారసంపన్నుల గుండెలు జలదరింపకమానవు. ఈవ్యభిచారాభిలాష నొక దుర్భరరోగంబు క్రిందఁదీసికొని విమర్శించవచ్చును. ఈరోగము మానవుని ప్రాణ మాన ధనంబులను మూటిని నామరూపములు లేకుండ నాశనముఁ జేయుచున్నది. ఇతర దేశములలో వ్యభిచారముకొఱకై ప్రత్యేక కులములు సృష్టింపఁబడకున్నను భరతఖండము

యొక్క దురదృష్టము ననుసరించి మిగత దురాచారములకుఁ దోడుగా నీవ్యభిచారమునకుఁ గాను బ్రత్యేక కులములున్నటుల మనము నమ్ముచున్నారము. మన నమ్మకము నిజమైనచో నీకులములు దైవనిర్మితములా ? లేక ప్రాచీనులచే నేర్పరుపఁబడినవా ? వీనిలో నేవియునుం గాక ప్రస్తుతకాలపు నాగరికులయొక్క కల్పితములా యని మనము ప్రశ్నించి చూచుకొనవలసియున్నది.

సృష్టిస్థితిలయకారణభూతుఁడగు నప్పరాత్పరునకు మానవజాతి యొక్క నిర్మాణమునం దెట్టి,పక్షపాతము నుండ నేరదని మానమ్మక మగుటచే నిందువిషయమై పరాత్పరుఁడు దోషాకరుఁడు కానేరఁడనియు నందుచే మానవాచార వ్యవహారములలోఁ గూడ భేదమును బాటించియుండఁడనియు విశ్వసించెదము. ఇఁక రెండవ విషయము. సర్వసంగపరిత్యాగులై వనవిహారులై వాయుభక్షకులై తమ కాలమంతయు నీశ్వరారాధనమందే గడపి తమజన్మముల సార్థకపఱచుకొనిన మహానుభావుల...గ్రంథము లన్నిఁటియందును వ్యభిచారదోషము మహాపాతక హేతువుగా నిర్ణయింపఁబడినపు డీయపవాదును వారిపై మోపుటచే మనకుఁ గొంతపాపము సంప్రాప్తమగునేమో యని తలంచెదము. ఇఁక నీదోషమెవ్వరియందున్నది ? అది వేఱుగ వ్రాయనక్కఱలేదు. అయితే, ఇట్టి మహాదోష మాకాలములలో మాత్రము లేదా యని రావణుఁడు కీచకుఁడు కిరాతకుఁడు చంద్రుఁడు నింద్రుఁడు విశ్వామిత్రుఁడు మున్నగువారిని గొందఱి నుదాహరణముగాఁ దీసికొని గొన్ని కుశ్శంకలను బయలుదేఱఁ దీయవచ్చునుగాని వానికి వారు పొందిన ఫలితములే ప్రబలసాక్ష్యములై గ్రంథస్థములై మనకు నీతిదాయకములై యలరారుచుండ నట్టి కుశ్శంకలకుఁ బ్రత్యేక సమాధానములేల యని మేము సమాధాన మీయవచ్చునని మా తలంపు.

అట్టి యుద్గ్రంథరాజములనే యాధారపఱచుకొని పై శీర్షికను గూర్చి మాయభిప్రాయములఁ గొన్నిటిఁ దెల్పుకొందుము. వ్యభిచారదోషము మిగత దురాచారములకంటె ఘోరతమమైనది. ఈదోషము తరతరముల వెంబడి వెళ్ళాడునది. మిగత దోషములకు దోషమునను సరించి యిహంబున రాజదండనయుఁ బరంబున యమదండనయుం మాత్రమే సంప్రాప్తమగును. అంతియేకాని యీవ్యభిచార దోషమునకుఁ బలె మానవుఁడు తనజీవితమంతయు సుఖవ్యాధులపేరఁ బిలువబడెడు దుర్భరతమములైన ఘోర వ్యాధులచేఁ బీడింపఁబడనక్కఱలేదు. అతిజారత్వముచేఁ దిరుగువారి కీశిక్ష మఱొకవాలముగా నుండఁగలదు.

ఈ వ్యభిచార రోగముచేఁ బలువురు పీడింపఁబడుచుఁ దాము బాధనందుటయే కాకఁ దమ సంతతివారి కందువలనఁ గలుగు ఫలితముల సంక్రమింపఁ జేయుచున్నను నిందుమూలమున నసంఖ్యాకములగు హత్యలుఁ గష్టలు మోసములుఁ బ్రబలుచున్నను నానాఁటికి జారులసంఖ్య పెరుఁగుచునే యున్నదికాని విఱుగుటలేదు, తామరవలె

దేశము నలుదిశలకుఁ బ్రాకిపోయినది. వ్యభిచారులకు సిగ్గు విడియము పూజ్యమైనది. ఐశ్వర్యముపై లక్ష్యము సన్నగిల్లినది. ఆరోగ్యముపై శ్రద్ధ రూపుమాసినది. పత్రిక లందలి పటాటోపపుఁ బ్రకటనలపై మోజు హెచ్చినది. శృంగార గ్రంథములపై పోకు ప్రబలినది. వారెవరో వారిని వారే నుఱచియున్నారు. వైద్యాలయము లందలి చికిత్స పొందిన రోగుల సంఖ్యలో వీరి సంఖ్యయే యభివృద్ధిఁ జెందుచున్నటుల వినుచున్నారము. ఇరియంతయుఁ భారతదేశ దారిద్ర్యమునకు హేతుభూతమై ఆరోగ్యలక్ష్మికి శాశ్వత మశిఖాకరమై యభారోగ్యదేవతకు శాశ్వతసంతోషప్రదమై తనరారుచున్నది. కట్టా! భరతమాత దురదృష్టము.

ఈదురదృష్ట దేవతకు స్వస్తిఁజెప్పుటకై బొంబాయిరాజధానివారు వ్యభిచార వృత్తిచే జీవించువారికి గృహముల నద్దెల కీయరాదను మొదలగు కొన్ని కట్టుదిట్టముల నేర్పఱచి తన్మూలముగఁ గొద్దిగనో గొప్పగనో వ్యభిచారదోషమును నిర్మూలముఁ జేయుచున్నారు. ఇట్టిదశ మిగత రాష్ట్రములవారికిఁ గూడ వ్యాపించి తన్మూలమున భారతీయుల దారిద్ర్యము తొలంగుటయుఁ నారోగ్యలక్ష్మికి శాశ్వతశాంతి చేకూఱుటయుఁ త్వరలో భగవంతుఁడు ప్రసాదించుఁగాక యని యర్థించెదము.

ఈరోగమును నిర్మూలించు భారము మనపైనున్నదా పాలకులపై నున్నదా యని మనము ముఖ్యముగాఁ బ్రశ్నించుకొనవలయును. మనపైనే కలదని మానమతము. 1. సాంఘిక దురాచార బహిష్కార ప్రోత్సాహమునకుఁ దగు కృషి సల్పనచో 2. శృంగార రసమిళిత గ్రంథములనే పఠించుచో 3. గతజల సేతుబంధనమును గూర్చి విచారింపక భావికర్తవ్యమును గూర్చి జాగ్రత్తపడినచో మన కర్తవ్య మీడేఱఁగలదని మానమతము. కాని యిట్టికష్టసమస్యయౌ దుర్ఘటమైనదై యొకనాఁటితోఁగాని యొక మేటితోఁగాని యడుగంటునది కాదున్నను నీపరిశ్రమ మానవుని విధాయక కృత్యములలో నొకటియగుటచేఁ దద్విషయమును గూర్చి శ్రద్ధవహింపవలసిన బాధ్యత మనదే. సాంఘిక దురాచారముల విసర్జించుటలోఁ గూడఁ బాలకుల సహాయ మపేక్షించుట మనకు భావ్యము కానేరదు. దేశాభ్యుదయమునకై పాటుపడు మహనీయులీవిషయములలోఁ గూడఁ దగుశ్రద్ధ చేయుచునేయున్నారు. కాని వ్యభిచారమునకుఁ బ్రత్యేక కులమున్నదని మనము పొరపాటుగా విశ్వసించుచున్న కులము యొక్క యభ్యున్నతికే ప్రచారమును వినియోగించుచున్నారు. వ్యభిచార మొక్క కులమునందే కాక యనేక కులము లందనేక రూపములుగా విస్తరిల్లుచుండుటచే నసలు వ్యభిచారదోషమునే రూపుమాపుటకు మనము యత్నించవలయునని కోరెదము.

నేఁటివార్తలనుబట్టి నూతన విషయములు కొన్ని తెలియవచ్చుచున్నవి. వారణాసి మ్యునిసిపలువారు వ్యభిచారులు నగరావరణములో నుండఁగూడదని తీర్మానము గావించిరి.

అమలాపురములో నొక వేశ్యకాంత వ్యభిచారదోషమును గూర్చి యుపన్యసించుచు వ్యభిచారులను గొంకిపురుగులతోఁ బోల్చుచున్నది

వీనినిబట్టి వ్యభిచార దోషమును రూపు మాపుటకు దేశములోఁ బ్రబోధము బయలుదేఱినదని మనము గ్రహించనగును. ఈప్రబోధమును నలుదెసలఁ బ్రాకఁజేసి యంటువ్యాధులలోఁ బరిగణింపదగిన వ్యభిచారరోగమును నిర్మూలన మొనర్తురుగాక యని వేడెదము.

(ఆరోగ్యపత్రికనుండి.)

—♦ తులసీ మహిమ ♦—

హిందువులందఱును దులసిని చాల భక్తితో చూచెదరు. దేవునిపూజకుఁదులసి ముఖ్యతమము. తులసి పూసల తావళములను చాలమంది ధరింతురు. తులసి కాష్ఠముతోఁ జందనము తీయుదురు. దానిని హోమము చేయుదురు. తులసి తీర్థము పుచ్చుకొందురు. ప్రతియింటను బృందావనమును నిర్మించి దానిలోఁదులసిని నాటి నిత్యమును స్త్రీలును బురుషులును నీళ్ళుపోసి ప్రదక్షిణము లొనరించెదరు. తులసి లక్ష్మీయవతారమనియు విష్ణుభక్తిప్రదాయినియనియు మహాపాతక నాశనియనియు నమ్ముదురు. స్త్రీలుపసుపు కుంకుమ పుష్పములు మున్నగువానితో బృందావనమునకుఁ బూజచేసెదరు. తులసీ కానన మున్నచోట భగవంతుండగు శ్రీహరి తప్పకయుండునని నమ్మి చాలమంది తులసీవనములను దొడ్లలోఁ బెంచెదరు. మరణ సమయమునఁ దులసీతీర్థమును నోటఁబోసెదరు. తులసీదళములను దిందురు తలలోను జెవులసందునను ధరింతురు. ఇవియంతయును మత సంబంధమే. తులసిని స్మరించుటవలనను స్పృశించుటవలనను సమస్తవ్యాధులును మనోవ్యాధులును దొలఁగునని నమ్మెదరు.

తులసిలో నొకటి తెల్లజాతి యొకటి నల్లజాతి రెండుజాతులున్నవి. నల్లజాతిని గృష్ణతులసి యనియు తెల్లజాతిని లక్ష్మీతులసి యనియు నందురు. తులసిదళములను దినినఁ గొద్దిగాఁ గారముగానుండును. వైద్యసంబంధముగాఁగూడ దీనివలనఁ జాలగుణము కలదు.

మన్యపుజ్వరము చలిజ్వరము రోజువిడిచి రోజువచ్చుజ్వరము మున్నగువానికిఁ దులసియాకుల కషాయము మంచి పనిచేయును. ఆకుల నెండఁబెట్టి పొడిచేసి పీల్చినచో ముక్కులోగలుగు వ్యాధులన్నియుఁ దొలఁగును. నిమ్మపండురసములోఁ దులసియాకు

రసము కలిపి రాచినచో నన్ని చర్మవ్యాధులును దొలఁగును. తులసిగింజల నెండఁబెట్టి పొడిచేసి తేనెలోఁగలిపి పుచ్చుకొనిన దగ్గులును బడిసెములును మూత్రవ్యాధులును దొలఁగును. తులసిచెట్టున వెన్నులు బయలుదేఱి వానిలో గింజలేర్పడును. వానినెండిన పిమ్మటఁ గోసి యాగింజలనుదీసి గుండ చేయవలెను. శిశువులకుఁ గడుపుబ్బరము కలిగినచోఁ దులసి యాకు కషాయము నీయవలెను. పెద్దవాండ్రకైనచో నల్లపురసములోఁ దులసియాకు రసముకలిపి యీయవలెను నీరుల్లిరసమును నల్లపురసమును దేనెను దులసియాకుఁ రసమును కలిపియిచ్చినఁ గూడ దగ్గుతగ్గును. విషములకు దులసిపువ్వులరసము విరుగుడు. పాదరసము కలిసిన మందులను దినుటవలన నోరు పుండై యేమియును ద్రాగ వీలులేనపుడు తులసి యాకు రసము త్రాగుటవలనఁ దగ్గును. పాముకఱచినవారికిఁ దులసియాకులు బువ్వులు వెన్నులు సన్నపాటివేళ్లు నూఱి త్రాగించవలెను. తులసితోఁటయున్నచోట దోమలుండవు గానఁ దులసిచెట్లను గోలెములలో వేసి యిండ్లలోఁ బెట్టుకొనుట మంచిది. చెవులోఁ బోటు వచ్చినచోఁ దులసియాకు రసము పిండినఁ దగ్గును. పైత్యము హెచ్చినపుడు తులసియాకు రసము త్రాగుటమంచిది అది పైత్యహరము. ముక్కులలోఁగలుగు పీనస వ్యాధికూడఁ బోవును. తులసియాకు రసమును సూర్యోదయమున 3, 4 తులములను సాయంకాలము 3, 4 తులములును బుచ్చుకొనవచ్చును.

ఇటులఁ దులసిలో ననేకవిధములగు మేలుకలదు. కావునే పారమార్థికముగ మాత్రమేగాక ఐహికముగఁగూడఁ దులసి ముఖ్యమైయున్నది. పారిశుధ్యమున కిది మూలాధారము. దోమలను రూపుమాపును దుర్వాయువులను హరింపఁజేయును. క్రిములను హరింపఁజేయును. ఆరోగ్యకరముగఁ జాల విధముల నిది యుపయోగపడును. పారమార్థికముగ దీనిమహిమ యగణ్యమని వెక్కుశతాబ్దములనుండియు భారతీయుంలలోఁ గోట్లకొలఁదిమంది విశ్వసించుచున్నారు. కాన సూరక వాసనయును బువ్వులును నుపయోగమునుగూడ లేని పిచ్చియాకుల కోట్లను గోలెములలో లేసి పెట్టుకొనుటకంటెఁ దులసిచెట్లను ... పెట్టుకొనుట చాల లాభకరమని యెల్లవారును గ్రహించి యటులొనరించి యారోగ్య పారిశుధ్యములను ఐహికాముష్మికసుఖములను బడయుందురుగాక

(అ ప్ర.)

— విదురుఁడు —

(శిష్టా సూర్యనారాయణశాస్త్రిగారు)

...ధర్మవేత్తలలో విదురుం డగ్రగణ్యుఁడు...దాసీపుత్రుఁడైనను ధృతరాష్ట్ర పాండురాజులవలె వ్యాసునివలన జన్మించిన కారణముచే... భీష్ముఁ డర్హరీతి వివాహాది సమస్తకర్మలం జేసెను. ఇతఁడు గాఙ్గ్యాంగవేత్త-ధర్మరహస్యవేది-ధర్మపక్షపాతి .. బ్రహ్మజ్ఞాని...భారతము...లో విదురనీతి...సంస్తూయమానమై యొప్పెసది. కౌరవకృతాపకారములనుండి పాండవులను బ్రతికినను విదురుఁడు బహిరంగముగను రహస్యముగను... రక్షించె . ప్రత్యపకారము చేయుటకు... ప్రేరేపలేదు. విదురునిఁ జూచి సుయోధనుఁడు భయపడెడివాఁడు. ...రాజకార్యధురంధరుఁడగుటచేతను .. పండితుఁడగుటచేతను... భీష్మాదులకు మాననీయుఁడగుటచేతను నతనిం జెన...కుట . కపకారము లేదు . పాండవులను జతుగృహదాహమునుండి తప్పించుటలో విదురుని ప్రజ్ఞ యద్వితీయమైనది. దుర్యోధనాదులు ... రహస్యముగాఁ బ్రయత్నించినను విదురుఁ డెట్లో గ్రహించుచునే యుండెను ... ధృతరాష్ట్ర దుర్యోధనులకు హిత ముపదేశించుచున్నాఁడు కాని వృథయయ్యెను.

...పెండ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రిగారు లాక్షాగృహదహనమున విదురసాహాయ్యము లేకుండినచోఁ బాండవుల గతియేమయ్యెడిదో యని వ్రాసియున్నారు.

దగ్ధులైయుందురని వారి యభిప్రాయము. కౌరవాపకారములు ... విఫలములగునని విధి నిర్ణయించియున్నాఁడుగాన విదురసాహాయ్యము లేకున్నను బాండవుల కాపద్భయము లేదు. విభీషణసాహాయ్యము లేనిచో రామునిగతి యేమయ్యెడిదో ?... కృష్ణుఁడు చక్రహస్తుఁడై యుద్ధమున నిలిచిన దుర్యోధనుగతి యేమయ్యెడిదో.. ఘోషయాత్రలో గంధర్వరాజుచే దుర్యోధనాదు లందఱు బంధింపఁబడినపుడు పాండవులు విడిపింపని యెడల వారిగతి యేమయ్యెడిదో...పాండురాజు బ్రదికియుండినచో ధృతరాష్ట్ర దుర్యోధను లేమి చేసియుందురో ... భీష్మసంరక్షణ లేనియెడలఁ గురుసామ్రాజ్యమేమై యుండునో యనువాక్యమున కర్థమేమి ?.. ఇది విమర్శకు లక్షణము.

...విదురుఁడు యుద్ధమును మాన్పింపవలయునని శక్తికొలఁది ప్రయత్నించి....విఫలుఁడై చూచుచు నూరకుండెను.

...సామ్రాజ్యనిర్వహణమున ధర్మజునకుఁ గొంతకాలము చేదోడుగా నుండి చివరకు....వానప్రస్థాశ్రమమున కరిగి కొంతకాల మనిలాంబుభక్షుఁడై....తపస్సు చేయుచు ....ధర్ముం గలసెను...

గా నొల్లఁ డంతకాలము
వానికి నం దెదియుఁ బట్టువడదు కుమారా! 612

వ. రామా! శాలిక్షేత్రరక్షిణి యగుపడఁతి వితతకరతాలలయాన్వితం బుగ గీతికాగానంబు సేయుచుఁ గరతాళధ్వనిచేతఁ బులుఁగులం బెదరంగొట్టుచుఁ దాను గీతానందంబు ననుభవించుతెఱంగున, నిస్పృహుండును గర్తృత్వరహితుండును నగుపురుషుండు జ్ఞానసదాచారంబు లేకకాలంబునందే సమానంబుగ నభ్యసించుచు సదాచారబలంబున భ్రమప్రమాదాదివిఘ్నంబులం బాఱఁదోలి జ్ఞానానందంబుఁ గాంచుచుండు. 613

క. సక్రమత నిటు సదాచా
రక్రమ మెఱిఁగించినాఁడ, రఘువర! యిఁక జ్ఞా
నక్రమముఁ గరతలామల
కక్రియ నెఱిఁగింతుఁ బైప్రకరణమునందున్. 614

క. విమలయశంబును, నాయు
ష్యముఁ బురుషార్థమును గూర్పఁజాలెడు నీశా
స్త్రముఁ దద్జ్ఞజనులసన్నిధి
ముముక్షు వగువాఁడు వినుట ముఖ్యము రామా! 615

తే. కతకసంశ్లేషమునఁ జేసి కలుషజలము
తేఱఁబాఱినతీరున దీనివినిన
యంతనే బుద్ధి నైర్మల్య మంది మోక్ష
మధిగమింపంగఁబడు సందియంబు లేదు. 616

తే. విదితవేద్యం బయి తనర్పువిబుధుచిత్త
మవశముగ నుత్తమస్థాన మధిగమించు.
బోధపరవశమై యుండుబుద్ధి యయ్యు
ఖండపదమును విడువక యుండుఁగాదె! 617

—♦ ప్రకరణాంతము ♦—

మ. శమసంతోషవిచారసాధుజనతాసాంగత్యసంశోభితా !
విమలాచారవివేకపాలనరతా! విద్వజ్జనప్రస్తుతా!
మమతాహంకృతివర్జితా! సుసమతామాధుర్యసౌఖ్యాన్వితా!
కమనీయోక్తివిలాసవిస్ఫురిత! మార్కండేయనామాంకితా! 618

క. భాషాపోషణ! బుధజన
తోషణ! కామాదిశత్రుదూషణ! మృదుసం
భాషణ! శమదమకరుణా
భూషణ! నిరతాత్మబోధపూర్ణసుధిషణా! 619

ఇది శ్రీరామచంద్రసాంద్రకరుణాసమాసాదితసరసకవితావైభవ
మద్దూరివంశోద్భవ కాశ్యపసగోత్ర సుబ్బమాంబా
నరసయార్యకనిష్ఠపుత్త్రి సకలవిద్వద్విధేయ సాంబ
శివనామధేయ ప్రణీతం బైనశ్రీమదాంధ్ర
యోగవాసిష్ఠంబునందు ముముక్షు
వ్యవహారప్రకరణంబు
సంపూర్ణంబు.

గుంటూరు, చంద్రికాముద్రాక్షరశాలయందు ముద్రింపంబడియె.

ఆ అట్లు తోఁచుదృశ్యతాభాసముం గాంచి
అదియె తనదురూప మని భ్రమించి
ఆత్మ జీవభావ మందు ఘటాదిక
చ్ఛన్న మైనయాకసంబుభంగి. 600

తే వేదనముకన్న దృశ్యంబు వేఱు గాదు
వేదనము ద్రష్టకన్నను వేఱు గాదు
కాన ద్రష్టయు దృశ్య మేకంబ యగుట
తేటతెల్లమ కాదె సుధీవిధేయ! 601

తే దృక్స్వరూపకుఁ డగుద్రష్ట దృక్స్వరూప
విచ్యుతిం గన్న దృశ్యంబు వెలయుఁజుమ్ము.
కాక దృగ్రూపమునయంద క్రాలు నేని
దృశ్యము తనంతఁ దాన యదృశ్య మగును. 602

వ. ఇట్లు ప్రత్యక్షప్రమాణతత్త్వవిమర్శంబున సకారణం బగుదృశ్యంబు మిథ్యయనియు నకారణం బగుబ్రహ్మంబే సత్యమనియు సిద్ధమగుచున్నది. కానఁ బ్రత్యక్షం బొక్కండే ప్రధానప్రమాణంబు. ఇతరంబు లగునను మానాదులు తదీయాంశమాత్రంబులు. ప్రత్యక్షంబు నాశ్రయించి విచారంబు గావించుచు దైవశబ్దార్థంబును దూరంబునం బరిత్యజించి, పురుషకారబలంబున నింద్రియంబుల జయించి క్రియాశూరు లగునధికారులు హృదయంబునందే బ్రహ్మసాక్షాత్కారంబు గాంతురు. కావున నీవు పరమార్థరూపంబును బ్రమాణపరిశుద్ధంబును సంప్రదాయసిద్ధంబును నగుమతంబు ననుసరించి, త్రివిధపరిచ్ఛేదశూన్యం బగుపరమపదంబును స్వబుద్ధియందే ప్రాపించునంతవఱకును నాత్మవిచారంబు గావింపుమని వెండియు నిట్లనియె.

— ♦ సదాచారనిరూపణము ♦ —

తే. అమలచిత్త! ముముక్షు వౌనతఁడు తొలుత
నార్యసంగమబుద్ధిచే నాత్మబుద్ధి
వృద్ధి గావించుకొనుచు వివేక మెనసి
ఆవల మహాపురుషభావ మందవలయు. 604

తే. ఒకనియం దెల్లసుగుణంబు లుండ కున్న
నెవనియం దెద్ది మిన్నయై యొసఁగుచుండు
నతనికడ నట్టిసుగుణంబు నభ్యసించి
శీఘ్రముగ బుద్ధి వృద్ధిచేసికొనవలయు. 605

తే. శమము మున్నగుగుణముల నమరియుంట
యే మహాపూరుషత యని యెన్నఁబడును.
అదియు జ్ఞానబలంబు లేనిది యొకింత
సిద్ధి నందదుసుమ్ము విశుద్ధహృదయ! 606

ఉ జ్ఞానముచే శమాదులు ప్రశస్తఫలాఢ్యములై ప్రవృద్ధి నెం
తేనియుఁ గాంచు సస్యములు వృష్టిని బోలె; శమాదులన్ సువి
జ్ఞానము నట్లె వృద్ధిఁగనుఁ జారుతరాన్నమయాధ్వరంబులన్
వానలు బాగుగన్ గురియువైఖరి; భానుకులైకభూషణా! 607

క. శమమును జ్ఞానము నన్యో
న్యము వృద్ధిద మగుచుఁ దనరు ననవరతంబున్
గమలములఁ గొలను, గొలనుఁ
గమలమ్ములు పెంపుగాంచుకరణిఁ గుమారా! 608
వ. అట్లు 609

క ఆరయ జ్ఞానమున సదా
చారంబు ప్రవృద్ధిఁ గను భృశంబుగను, సదా
చారమున నట్లె జ్ఞానం
బారూఢం బగుచు వృద్ధి నందు గుణాఢ్యా! 610

తే. కాన ధీమంతుఁ డగువాఁడు కడఁకతోడ
శమము, ప్రజ్ఞ, మహాపూరుషత, గడించి
శ్రవణమననాదిపురుషకారమున జ్ఞాన
మును సదాచారమును నేర్చికొనఁగవలయు 611
క. జ్ఞానసదాచారంబులు
మానవుఁ డొందనుకఁ దా సమంబుగ నేర్వం

—♦ శంకరప్పగారి సాచివ్యము ♦—

శ్లో॥ విభూషణం మౌన మపండితానాం.

ఆట్లాయన యధికారరోగపూరితుఁడై యస్మద్దర్శన మైనను గానట్టభినయించి తొలఁగిపోవుచుఁ గడ కెప్పుడో పలుకరించుటయు నట్లే యైదుదినములు పడియుంటిని. అయ్యది హంపీవిరూపాక్షేశ్వరు నుత్సవసమయము. ఆ దేవస్థానపు దివాన్ బాజాల వేంకటేశశాస్త్రిగారు కనుక నన్నదానాదిక మతివైభవముగా జరుపఁబడుచుండు టయు నందే యంతర్భూతమై విరూపాక్షమఠసత్రమును వెనుకటివలె గుజ్జాలు తిను నెజ్జి బియ్యపుటన్నము గాక యేతెంచిన యిలామరుల నింత సంతోషపెట్టుచు సమర్థముగనే జరుగుచున్నది. ఆరాధన లని యవి యివి చేయుచున్నారు బ్రాహ్మణులు భక్ష్యభోజ్యములు భుజించుచున్నారు. అభినవాంశుకములచే నలంకరింపఁబడుచున్నా రనేకులు.

శ్లో॥ అధిగమ్య కృతే దానం త్రేతా స్వాహూయ దీయతే.
ద్వాపరే యాచమానాయ. సేవయా దీయతే కలౌ.

అను పరాశరోక్తి నన్వర్థముచేయుచు నా విరూపాక్షసంస్థానామాత్యు లాశ్రిత పక్షపాత మగపఱచుచున్నారు. ఆదరణ మంతగా లేని యస్మదాదులకును గడుపు నిండ నింత కబళము దొరకుచుఁ గాలము గడచుచుండెను. కాని కబళమునకే చన్నవాఁడను గానుగానఁ గలకార్యము ప్రధానామాత్యులకుఁ దెలుపఁ బ్రయత్నించితిని. ఆ ప్రధానామాత్యులు మన సుబ్బయ్యశాస్త్రిగారే. కాని వారు వాంఛితార్థపూరణమున వహియింపరు భారము. సర్వసంగపరిత్యాగము సల్పితిమని శంకరప్పగారిమీఁదికి బాఱ విడిచిరి. శంకరప్పగారి సోదరియే సుబ్బప్పగారి సుదతి. వీరి మేనమామ లక్ష్మీ నరసప్పగారి కుమారులే వారు. వీరు విరూపాక్షసంస్థానమున విద్వత్కవి విభవ మే ననుభవించునాఁటి కావిర్భవింపనే లేదు. అయ్య లక్ష్మీనరసింహయ్యయే యనభివ్యక్తాస్మత్ప్రాగుప్తప్రజ్ఞులు. అట్టివారి కిట్టివారు పుట్టుటయుఁ బెరుఁగుటయుఁ నిట్టివా రగుటయు బిట్టు సంతోషకరము. సుబ్బప్పగారి శిరోభరమును సొంతశిరమున వైచికొని నియోగిత్వము నెఱపు శంకరశాస్త్రిగారి నింక నే నాశ్రయింపవలసి వచ్చెను. ఆశ్రయింప నాశ్రయింప నాయన కనుగ్రహ మణుమాత్ర మావిర్భవించి కట్టుఁబాట్లు కొన్ని కాంక్షించి కడకు గౌరవముగనే నన్ను నడిపించిరి పత్రికలోఁ బ్రతిమాసమును విరూపాక్షవిశేషము లుండవలెనఁట. అవియే కట్టుఁబాట్లు. తద్విశేషములు తత్సంబంధులకును దగ్గఱివారికిని దప్పఁ దదితరులకుఁ దెలియవు. బహుదూరస్థుఁడనగు నేను బ్రతిమాసమును నేమివ్రాయఁగలను ? మీరో మీయాస్థానపండితులో వ్రాసిపంపుచుండినచో వేసిపంపుచుందునని విన్నవించుకొంటిని గాని యేదో విషయము దీసికొని యెట్లో యీరలే యీఁటనిచేయవలెనని భారము నాపైననే పడవేసి శుక్ల సం॥ లోఁ జూకాకపురమం దొక్కయేటిచందా యందుకొనివచ్చి ప్రమోదూత ప్రజోత్పత్తులలోఁ బనివినఁ

బడక యాంగీరసలో నరిగినను నాయబ్దపు టర్థమును హంపీ క్షేత్రమని యశరీకాముత్రై యనేకుల ఘనవసనములచేఁ గైసేగుంకాలమగుట నొక్కసేలును వాసంగి యంత్రమార్గము ననే పంపించెను. కాని సుబ్బయ్యశాస్త్రిగారు పెట్టిన ప్రధానిభార మీయనపైననే యెంతయో కాల ముండుచుండుటచే నే నింకను నెన్నోసారు లేగవలసివచ్చుటయు నిక్కట్లకు లోనగుటయుఁ దటస్థించినవి. ఆంగీరస తరువాత యువ సం॥ నాకుఁ దత్పీరసవిధమునకుఁ బోకడ కలిగెను. ఆశంకరయ్యగారి దర్శన మారంభమున నాదోనిలోనే యగుటయు స్వాములవారిని దర్శింపఁ జనుదెంచుచుంటిని గాన నెక్కడనుండిరని యేను బ్రశ్నించితిని. ఎక్కడనో యుండిరనియు నేతెంచుట కిది యదను కాదనియు నేమో చెప్పెను పదునైదుదినములు వెళ్ళిన వదఁపడి పనివింటిని. ప్రధాని పలుకరింపఁడు. స్వాములవారి సత్రమని యొక డుండెఁగావున నేమూలనో కూర్చుండి నేను నింత సాపడుచు నేమరశిష్యు నిరఘననో పన్నుండుచు నీదిగువలేఖ శంకరశాస్త్రిగారి సముఖమునకుఁ బంపించితిని.

తే॥ గీ॥ అప్ప! శంకరశాస్త్రి! నాయందదేమొ
పాఱకున్నది నీదు కృపారసంబు
ఈవు కడుఁ జిన్నవాఁడవై యెఱుఁగకున్కి
చెప్పకొనియెద నాస్థితి చిత్తగింపు.

ఉ॥ ముప్పదినాలుగబ్దముల ముందటినుండియు యిమ్మఠంబులో
మెప్పను జెందుచుండితిని. మేకొని స్వాములు మంత్రిసంచయం
బప్పటినుండి యింతవఱ కగ్గల మాదృతిఁ జూపుచున్నవా.
రిప్పుడు క్రొత్తగా నిచటి కేనరుదెంచినవాఁడఁగానుజా.

...గీ॥ ఇట్లు మీబంధుజనముల కెల్లరకును
అగ్గలము ప్రేమభాజన మైన నన్ను
నోటిముత్యాలు రాలునంచోటు సరిగ
పలుకరింప వహో! ఇంతపాపమయ్య?

....కం॥ తలఁపవు కూర్చుండుమనక.
సలిపెడిప్రశ్నముల కీయఁజన వుత్తరముక.
తిలకించినచో నీదగు
పలుకే బంగారమయ్యె పాప మదేనో!

తే॥ గీ॥ సంఘమంతకు వలసిన సంగతులను
తెలుపు పత్రికలో నెలనెలనుగూడ

పీఠసంబంధి యొది తెచ్చిపెట్టువాఁడ ?
అట్టి మీ ర్పంపుటకు నేమియడ్డినాఁడ !

ఆ॥ వె॥ ఈమఠాధిపతులు నితరులతోపాటు
లలిఁ బ్రధానపోషకులుగ నుండి.
రంతమాత్రముననె యఖిలమాసంబుల
వెల్లడింపవలెనె వీరి స్థితిని ?

ఆ॥ వె॥ సంచరించుచుండు సతత మీపీఠంబు.
అడ్రసును లిఖించి యనుప రీర.
లరసి యనుపుచుందు నప్పటికిని నేను
పత్రికలను మీదుపాలి కెపుడు.

ఆ॥ వె॥ అందువలనఁ గొన్ని యందకపోవచ్చు.
ఏమిచేతు దాని ? కీరె చెప్పుఁడు.
కట్టుదిట్టములను గావింపుఁ డీఁక నేని
సరిగఁ జేరుటకును శంకరయ్య !

చం॥ ఇది తగుఁ గాని నాపయి ని ట్లేవో దోసంగుల వేయఁజూచుటల్
పెదమఠమందు మంత్రివయి పేరుప్రతిష్ఠలఁ గాంచనున్న స
ద్హృదయున కర్హమౌనె ? ఎట కేగిన మన్ననగాంచుచున్న స
న్నదయతఁ జూడఁగాఁదగునె ? అక్కట! చెప్పుమ శంకరాహ్వయా.

కం॥ ఈయది సంస్థానంబగు. పోయినపీఠాధిపతియె పోషించెను దా
నీయేర్పాటది నిలుపుట న్యాయంబటుపైఁ ద్వదిష్ట మఠాధిపతీ!

చం॥ నిలిపిన నిల్పకుండినను నేఁ బ్రచురించుచునుండు పత్రికన్
నిలుప. విశాల మీధరణి. నిల్పుఁ దదీయ ప్రధానపోషక
స్థలమున నేఁడొ వచ్చి. అది తద్ద విచారకరంబు గాన నీ
లలి మును దెల్పుకొంటి. నవలం ద్వదభీష్ట మమాత్యశేఖరా!

చ॥ ఎవ్వరొకండు నేటి కింకఁ దడ? విప్పుడె చేయుము. తింటె, పంటె యన్
సదయుఁడు లేనిచోట మనఁజాలను శంకరశాస్త్రి! నేఁటి కి
ట్లాదవిన దేమిచేయుదు. నహో! ఎది యేరికి నౌను శాశ్వతం ?
బది యెఱుఁగంగఁజాలక ధనాంధతతోడఁ జరింతు. రేమనన్ ?

ఆసమయమున సంస్థానపండితులు భువనగిరి వేంకటప్పయ్యశాస్త్రిగారు గోదావరీ మండలనివాసి శివరామశాస్త్రిగారు. అర్థాధికారి కర్థమయ్యెఁగాకయు నవ్వారి కాలేఖ చూపి తెలిసికొనియెను. ఆగ్రహము వచ్చినది కాని యాస్థానపండితు లయుక్త మిదియని యణంచివేసిరి ఎట్లో యాసం॥ పుఁ జందాయిచ్చెనుగాని శంకరజయంతికే చనుదెంచవలెనని కఠిననిబంధన గావించెను. నియమమునకు లోఁబడి కాదుకాని ధాతృ సం॥ రామేశ్వరయాత్రకని సకుటుంబముగా పంపిమీఁదుగా నరుగుటలో నాసిర మక్కుడనే యుండెను-క్షేత్రదేవతల సేవించుచు 10 దినము లుంటిమి. శంకరజయంతి జరిగెను. శంకరయ్యగారు జ్వరపడిరి- పీఠాధిపతి వృత్తము పెద్దగనే వివరఁ జేర్కొనవలసి యున్నదికాని, యయ్యామాత్యునకు సంబంధించిన యత్కించిచ్చారిత్రమిట నుడివెద. వీరి తల్లి యొప్పుడు వెంటనే యుండును. స్వాములవారి జననిగనుక సర్వులను శాసించును. స్వాములవారిని శాసించును ఆయన యీయమను నదలించును తల్లికొడుకులగుటఁ దత్తత్సమయములఁ దథావిధులైనను నన్యోన్యప్రేమ లగ్గలము. ఆమె యేదితలఁచిన నదిసైతీఱును. స్థిరచిత్త గాదు. ఒకొక్కయెడ నంతమంచిదిలే దనిపించును. ఒక్కయెడఁ జెడ్డదిలే దనిపించును. పండితులనేమి, పరులనేమి, బహుమర్యాదకుఁ బాత్రము చేయును. కర్మముచాలియుండనిచో మార్మసలు. ఆతడవ మాకర్మము చాలియున్నది. అధికగౌరవ మాచరించినది. విందులే చేసినది. స్త్రీజనమునకుఁ జీరలే పెట్టినది. కలశదానములే కావించినది. దక్షిణ లిచ్చినది. అదియంతయు నాత్మజు నంతికమునసే. శంకరయ్యగారు జ్వరముతో నుంటఁ గాఁబోలు స్వాములవారే స్వయముగాఁ జందాదయ చేసిరి. కాని తల్లి యిచ్చిన దక్షిణ తగ్గించిరి. వారి యీవి యిట్లువర్తిల్లుటయు లోభభూయిష్ఠముగు నిమ్మరమునకు వచ్చుటే లోపమని వెళ్లివచ్చి ప్రధానపోషకులలోని పరివ్రాజకుని పేరు తీసివేసి పత్రిక పంపుట మానకొంటిమి మానుకొన్నతరువాత మాపేరు తీసివేసితిరి కావున మీ పత్రిక మాకక్కఱ లేదని యుత్తరము వ్రాయించి పెత్తనము నిలుపుకొనిరి.

మఠముముందఱగనే మార్గమగుడు శంకరశాస్త్రిగారు స్వాములవారు చందా నాకుఁ దగ్గించియిచ్చుట ప్రమాదమని పశ్చాత్తాపము ప్రకటించిరి-పత్రిక మరలఁ బంపుమనిరి. కొల్హాపురమున నాకు గొప్పమర్యాద యున్నది. ప్రభువులుఁ బ్రధానులుఁ బండితులు నందఱు నభినవసరస్వతి నాదరింతురు-అట్టిచో నప్పట్ల నవనీసురు నొకనిఁ బ్రాయశ్చిత్తశుద్ధుఁ జేయవలసివచ్చుటయు నది ప్రభుసమ్మతమగుటయు వారి సంస్థానపండితుఁడు వనం సీతారామశాస్త్రిగారు వ్యతిరేకించియుండుటయుఁ బీఠాధిపులు పృథివీపతిపక్షమునఁ దీర్మానము చేయవలసియుండుటయుఁ దటస్థించెను-అందుకని శంకరశాస్త్రి నన్నావిమర్శనసభలో మెంబరుగాఁ దీసికొని స్వాభీష్టము చక్కఁబఱచుకొనియెను. అందుకుఁగా నయ్యెడ నెయ్యుఁడై యస్మదభీష్టప్రకార మంతయు నడిపి యర్హగౌరవముతో నంపెను.

'శ్లో॥ ప్రయోజనాపేక్షితయా ప్రభూణాం
ప్రాయశ్చలం గౌరవ మాశ్రితేషు.'

పీఠిక

ఈ 'యిల్లాలు' స్త్రీల యుపయోగార్థము కీ॥ శే॥ దంటు లక్ష్మీకాంతరావు గారిచే 1914 సం॥ న వ్రాయంబడి తత్కాలమున మొదటిభాగ మచ్చుపడియుండుట పెక్కండ్రకుఁ దెలిసినవిషయమే. తరువాతిభాగములు వారి కుమారునియొద్ద నుండి యుండ రావుగారు నా బాల్యమున స్కూల్సుయిన్‌స్పెక్టరుగానుండి యప్పుడప్పుడు మాయూరి యెలిమెంటరీస్కూలుపరీక్ష కరుదెంచుటలోఁ బరీక్ష్యమాణుఁడనగు నాపై బహ్వనుగ్రహదృష్టిఁ బఱపి యనంతర మస్మ దదృష్టానుసార మట్లు జరుగలేదుకాని. మాతండ్రిని మాయన్నను బిలువనంపి నీపిల్లఁడు తెలివికలవాఁడనియు నే స్కూలునను మత్పరీక్షితులైన బాలురలో నింతటిమేధావిని నే నీక్షింపలేదు కావున నింగ్లీ షీబాలున కుఁదప్పక చెప్పింపవలసినదనియుఁ జెప్పియుండుటచేతను దరువాత ధర్మబద్ధమగు తన యభిప్రాయముతో నేకీభవించిన యభినవసరస్వతి యారంభదశలోనే యాదృచ్ఛికముగా నగపడ నస్మద్బాల్యవృత్త మనుస్మరించి యత్యానందముతో నభినవసరస్వతిని దెప్పించి యత్యంతగౌరవముతో నావరణముఁ జందా యిచ్చియుండుటచేతను నటుపై నాయన యాత్మజుఁడుగూడ నదేవిధ మనుసరించుచు నొకరి యొద్దనుండియున్న పెద్ద గ్రంథము (ఇల్లాలు) నివలకుఁ గీసి పత్రికాద్వారమునఁ బ్రచురపఱుపఁ బ్రస్తావించుట చేతను బరమానందభరితుఁడనైతిని పదఁపడి ప్రవర్తన విషయము తద్గ్రంథకర్త తన యంని మనవియే యనువదించెడిని గాన దిగువఁ దిలకింపుఁడు.

"మా నాయనగారిచే వ్రాయఁబడిన యీ పుస్తకము 2, 3, 4, 5, 6, 7 భాగములు మా యుభయులకును స్నేహితులును నభినవసరస్వతీపత్రికాధిపతులును నగు బ్రహ్మశ్రీ నానపాటి పట్టాభిరామశాస్త్రిలుగారు దయతోఁ దమపత్రికలో నెలకు 4 పేజీలచొప్పునఁ బ్రచురించినందుల కనేక వందనములు. ముద్రింపించిన గుంటూరు చంద్రికా ప్రెస్సువారికిని ననేకనమస్కారములు. ఎట్లు దీనిఁ బ్రచురింతునా యని యెంచుచు నేను శాస్త్రిలుగారితో మాటలాడు సందర్భమున వారు తమపత్రికలోఁ బ్రచురింతుమని యెన్నిచిక్కులు వచ్చినను నీయుద్ధకాలములోఁగూడ నామాట త్రోసి వేయక గ్రంథమంతయుసరిచూచి తిరిగి శుద్ధముగ వ్రాసి నేఁటికీగ్రంథమును బ్రకటింపఁ గలిగిరి. భగవంతుని కృపవలన నీకఱవుకాలములో గ్రంథసమాప్తిచేసి యిచ్చినందుకు సంతసించుచున్నాను.

సుద్దపల్లి }
గుంటూరుతాలూకా }

విధేయుఁడు
దంటు లక్ష్మీనరసింహము"

ఈ నరసింహముగారును భాషాభిమానులు - స్వగ్రామమున గ్రంథాలయమే యొకటి స్థాపించి బద్ధశ్రద్ధతోఁ బాటుపడుచున్నారు. స్వయముగా స్వవిజ్ఞాపనలో వ్రాసి కొనలేదుకాని సహాయులై యభినవసరస్వతి కైదుగూపాయ లర్పించుచున్నారు. పత్రిక సాగునంతవఱకును బంపనున్నారు. అట్టివారి కుటుంబ మాయురారోగ్య భాగ్యములచే నభివృద్ధికి వచ్చుఁగాక- వీరు సంపన్నగృహస్థులు, భూస్వాములు. తెలగాణ్యులు. లక్ష్మీకాంతరావుగారి టైములోఁ గొంతకాలము గుంటూరున నుండినను వార్థక్యమువచ్చినతరువాత వారు సుద్దపల్లినే సుస్థిరులైరి. వారికున్న భూమియును నచ్చటనే. అవ్వారి భాషాజ్ఞానమున యత్కించిల్లోప మున్నను భాషాభిమానము బాగుగాఁ గలవారు. సనాతనధర్మపరులు. అయినను శుద్ధచ్ఛాందసులై మూఢాచారములకు ముందంజ వేయువారు గాక స్త్రీధర్మము లెల్లను దేటతెల్లముగ వివరించి కేవలము వర్ణసాంకర్యమును వాంఛించువారికి రుచింపకున్నను నాగరకులకు బాగని పించు పద్ధతినే యిల్లా లేదుభాగములును జల్లగా నడపఁగలిగిరి. స్వాతంత్ర్యవాదినులై సంకరమునే యపేక్షించు చానల సంగతి చెప్పఁజాలఁగాని యిహమే కాక పరముగూడ మున్నదని భావించు పతివ్రతలకుఁ బఠనీయమై యీ యిల్లా లెంతయు సంతసము కొల్పు చుండుటచేతనే యేను దీని భాషాసంస్కారమును బాగుగాఁ గావించి ప్రచురించితిని. స్త్రీపురుషుల కెల్లరకును నియ్యది యవశ్యపఠనీయమని యస్మదభిప్రాయము.

జానపాటి పట్టాభిరామశాస్త్రి

తప్పొప్పుల పట్టిక.

పుట	పంక్తి	తప్పు	ఒప్పు
8	25	సిద	సిద్ధ
9	7	ఐదు	ఇందు
14	33	చెలియనికిను	చెలియలికిని
48	32	పార్థించు	ప్రార్థించు
52	18	మైనదియు	మైయదియు
103	19	నిరసనమునగల	నిరసనముగల
104	14	కలిగినవెడు	కలిగినపుడు
109	32	ౖవ	దైవ
112	10	వారులై	వారలై
138	20	త్రిమూర్తల	త్రిమూర్తుల
	30	జ్ఞానుల	జ్ఞానులుమాత్రమే పతివ్రతల
	31	దప్ప	దప్ప నితరులకు
	32	పట్టివస్త్రములవె	పట్టినవస్త్రమువలె
144	19	గర్మా	గర్మాచరణాధి

—• ఆర్యధర్మముల వడ్డి. •—

(మహమ్మదుఖాసింఖాన్ సాహేబుగారు. ఎమ్. యే. హైద్రాబాదు.)

అహింస పరమధర్మమని యార్యధర్మము చాటుచున్నది. కాని యార్యధర్మానుయాయులు... పూర్ణార్థ మవగతము చేసికొనినట్లు లేదు. మాంసము దినకుండుటమాత్రమే యహింసయని మనదేశములో నొక సాధారణాభిప్రాయము కలదు- మాంసము తినుట హింసకాదని యెవరును ననఁజాలరు. ఆర్యధర్మకారులు యజ్ఞాదులందు మాంసాశనము ధర్మమేయని శాసించిరి-కాని యెట్టిపరిస్థితులందును ధర్మ్యముకాని యొక హింసావృత్తి ...పేర్కొనిరి. అదే వడ్డి. ధర్మకారులలో నగ్రగణ్యుఁడగు మనువు.

> శ్లో॥ బ్రాహ్మణః క్షత్రియోవాపి వృద్ధిం నైవ ప్రయోజయేత్
> వడ్డివ్యాపారము చేయరాదనుచున్నాఁడు.
>
> శ్లో॥ విష్ఠా వార్ధుషికస్యాన్నం (౪-౨౨౦)
> వడ్డివ్యాపారి యన్నము మలముతో సమానమనుచున్నాఁడు.

మనువువలె నాపస్తంబుఁడు కూడఁ దన ధర్మసూత్రములలో వడ్డి తీసికొని జీవించు [illegible]కదనుండి యన్నము స్వీకరించరా దనుచున్నాఁడు.

(౬-౧౮-౨౨)...వడ్డిపై దబ్బిచ్చువానికిఁ బ్రాయశ్చిత్తము విధించుచున్నాఁడు... యాజ్ఞవల్క్యుఁడు... నారదుఁడు... విష్ణువు...ఇదేవిధముగ వడ్డి నిషేధించుచున్నారు.

బౌద్ధధర్మములోఁగూడ వడ్డి నిషిద్ధమైయుండినట్లు జాతక కథలవల్లఁ దెలియుచున్నది...గ్రీకురాయబారి మెగాస్తనీసు మనదేశమును సందర్శించి ... భారతదేశమున వడ్డివ్యాపారము లేదని వ్రాసెను...ఇది మెగాస్తనీసు పొరపాటని కొందఱు వ్రాసినను ...నీచవృత్తిగానైనను నాఁటి భారతదేశమునఁ బరిగణింపఁబడుచుండెననుట నిర్వివాదాంశము. మెగాస్తనీసు నీచు లవలంబించు నీవృత్తిని గమనించియుండక పోవచ్చును.

పరులదారిద్ర్యమువలన లాభముపొంద వారి యవసరకార్యములలో నప్పుసప్పుల నిచ్చి ధనమునార్జించుటకంటె హింస మఱొకటి లేదనుట నిర్వివాదము. వడ్డివలన మనదేశ మెట్టి దరిద్రస్థితికి వచ్చినదో యొక్క మనగ్రామసీమలలో బీదరైతులు ప్రతియేడుఁ జెల్లించు వడ్డి 22 కోట్లని బ్యాంకింగు యెన్క్వైరీకమిటీవారు వేసిన యంచన తెలిసినచో బోధపడును.

ఇట్టిపరిస్థితులలో సనాతనధర్మప్రచారకులుఁ బండితులు నత్యంత హింసామూలక మగు వడ్డివృత్తి యెట్లార్యధర్మములయందు నిషిద్ధమైనదో ప్రపంచమునకుఁ జాఁటి యీమహాపాతకమునుండి యార్యధర్మానుయాయులను రక్షింతురుగాక.

పో ష కు లు

౧౨ పాలపర్తి రామబ్రహ్మముగారు, బెజవాడ
౧౩ టి. లక్ష్మణసింగుగారు, జనగాం.
౧౪ తిరుమలనల్లాన్ చక్రవర్తివరదాచార్యుల అయ్యవార్లంగారు శాతాపురము
౧౫ తూము రంగయ్యగారు, వకీలు - మట్టెవాడ
౧౬ కాకరాజు రామారావు దేశముఖుగారు, యాడవరము
౧౭ వేదాంతం లక్ష్మీనారాయణగారు, ప్లీడరు, తెనాలి.

స హా యు లు

౧ మెదక్ కిషన్‌రావు దేశముఖుగారు, నల్లపల్లి.
౨ రాయచూరి బండేరావుగారు, అయినాపురము.
3 రాజా మంత్రిప్రెగడ రాఘవరావుగారు - లింగగిరి.
౪ చిక్కరాజు మట్టపల్లిరావుగారు - చెలకుర్తి.
౫ నాదరగుల్ సంగమేశ్వరరావు దే॥ గారు శ్రీశ్రీ జగద్గురు పుష్పగిరి సంస్థానపు ఏజంటు
౬ అద్దంకి ... తిరువేంగడతాత దేశికాచార్యులయ్యవార్లంగారు. తక్కెళ్ళపాడు.
౭ మల్లాది నరసింహమూర్తిగారు, ప్లీడరు, గురజాల.
౮ కురికాల వెంకటేశ్వరరావు దేశముఖుగారు, పులిగెళ్ళ.
౯ జింకా వెంకటసుబ్బారావుగారు, వకీలు, గురజాల.
౧౦ వద్దిరాజు సత్యనారాయణరావు దేశపాండ్యాగారు, మేడిపల్లి.
౧౧ గొట్టిపర్తి సుబ్బారావుగారు, వకీలు, సింగరేణికాలరీసు.
౧౨ మారేపల్లి వెంకటకిషన్‌రావు, మాధవరావు దేశముఖుగార్లు
౧౩ దంటు లక్ష్మీనరసింహముగారు - సుద్దపల్లి [కాకర్లపల్లి
౧౪ ముద్దు చంద్రయ్య, మారేపల్లి మారుతిరా...
౧౫ పెసర వెంకటరెడ్డి దేశముఖుగా...
౧౬ వెంకటరామరెడ్డిగారు, పా...
౧౭ రాయప్రోలు రాఘవదీక్షి...
౧౮ కురికాలవెంకటరామా...
౨౦ పసుమాముల నృసింహ...

అభినవ సరస్వతి

సంపాదకుఁడు - నాగరఖండాది బహుగ్రంథకర్తయగు

జానపాటి పట్టాభిరామశాస్త్రి.

ఇది [illegible]మాసపత్రిక. ఇందు వర్ణాశ్రమధర్మబోధక గ్రంథములును విమర్శనము [illegible] వ్యాసములును ప్రకటింపఁబడును. చందా సం॥ 1 కి రు 3-0-0

ఈ కార్యస్థానమున వెలకు దొరకు పుస్తకములు

1	విరూపాక్షపీఠగురుపరంపర ...	0	2	6
2	వాసంతికాపరిణయ నాటకము ...	0	4	0
3	కలికోద్ధారిణి [ప్రాచీనప్రబంధము] ...	0	4	0
4	విశ్వబ్రాహ్మణశబ్దఖండనము, బ్రాహ్మణశబ్దవిచారము	0	2	0
5	విగ్రహారాధన ఖండనఖండనము ...	0	4	0
6	శుద్ధాంధ్రహరిశ్చంద్ర చరిత్రము ...	0	10	0
7	జాతకసంహిత (ఆంధ్రము) ...	2	0	0
8	భారతీయప్రబోధము (జానపాటి దిగంబరశాస్త్రి)	0	4	0
9	ధర్మనిర్ణయము ...	0	4	0
10	అస్పృశ్యతానివారణఖండనము(మల్లాదిరామకృష్ణచయనులుగారు)	0	8	0
11	స్కాందమహాపురాణాంతర్గత నాగరఖండము (౧ సంపుటము)	1	0	0
12	డిటో నాగరఖండము (౨ సంపుటము)	1	8	0
13	డిటో నాగరఖండము (౩ సంపుటము)	1	8	0
14	డిటో నాగరఖండము (౪ సంపుటము)	1	8	0
15	కళ్యాణవీరచరిత్ర	0	12	0
16	భాగవతరహస్యములు	0	4	0
17	జాతకచర్య (స్వకీయజాతకచరిత్ర)	1	8	0
18	[illegible]ంబరీవిడంబనము	0	4	0

[illegible], జానపాడు, పిడుగురాళ్లపోస్టు,

గుంటూరు జిల్లా.